# జీవవైవిధ్య పరిరక్షణకు సింహాలను కాపాడుకుందాం.!

'అడవులకే రాజులు (కింగ్ ఆఫ్ ఫారెస్ట్)" రాజఠీవి కలిగిన సింహాలు. అటవీ అందాలకే అవి దర్పణాలు. వన్యప్రాణులకే అవి రారాజులు. గంభీరమైన నడక, ఐదు మైళ్ల మేరకు వినిపించగల సింహ సమూహాల గర్జనలు వాటికి మాత్రమే సొంతం. మాంసాహార జీవుల్లో పెద్ద పిల్లి జాతికి చెందిన సింహాన్ని 'పాంథెరో లియో' అనబడే శాస్త్రీయ నామంతో పిలుస్తాం. సింహాలు వయసుతో నిమిత్తం లేకుండా అత్యంత ఆకర్షణీయ భారీ శరీర సౌష్టవంతో సమూహాలుగా మనుగడ కొనసాగిస్తూ, గడ్డి పెరిగే మైదాన ప్రాంతాల్లో నివసిస్తాయి. ఆడ సింహాలు తమ సంతానాన్ని పోషించే బాధ్యతను తీసుకుంటాయి. ప్రపంచవ్యాప్తంగా శతాబ్దం క్రితం లక్షల్లో ఉన్న సింహాల జనాభా నేడు యాభై వేల వరకు తగ్గిపోవడం సోచనీయం. ప్రాణ భయంతో సింహాలను వేటాడి చంపడం, వ్యాపార రీత్యా వల పన్ని పట్టుకోవడం, వాటి సహజసిద్ధ ఆవాసాలైన అడవులను నరికివేయడం, వాతావరణ ప్రతికూల మార్పులు, సరైన ఆహారం దొరక్క పోవడం లాంటి మానవ ప్రమేయ కారణాలతో సింహ జాతి జనాభా క్రమంగా తగ్గుతూ రానున్న ఏండ్లలో అంతరించే అంచుకు చేరవచ్చని జంతు అభిమానులు, పర్యావరణ ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు.

ప్రపంచ సింహాల దినం-2024:

సింహాలు, వన్య ప్రాణులను కాపాడాలనే యజ్ఞాన్ని

## (10 ఆగష్టు "ప్రపంచ సింహాల దినం" సందర్భంగా)

జీవిత లక్ష్యంగా నిర్ణయించుకున్న డెరెక్, బెవెర్లీ జోబర్ట్ దంపతుల చొరవతో 2013 నుంచి ప్రతి ఏట 10 ఆగష్టున విశ్వ దేశాలు 'ప్రపంచ సింహాల దినం(వరల్డ్ లయన్ డే)' పాటించుట ఆనవాయితీగా మారింది. ఒకప్పుడు పలు దేశాల్లో కనిపించిన సింహాలు నేడు ఇండియా, దక్షిణ సబ్-సహారా ఆఫ్రికా ప్రాంతాల్లో మాత్రమే అధికంగా కనిపిస్తున్నాయి. సింహాల జనాభాను పెంచడానికి, వాటి ఆవాసాలను సురక్షితం చేయడానికి, జీవవైవిధ్యాన్ని పరిరక్షించడానికి ప్రపంచ సింహాల దినం దోహదపడుతున్నది. మగ సింహాల శరీర బరువు 170 – 230 కేజీలు, ఆడ సింహాలు 180 కేజీల వరకు బరువు ఉంటాయి. ఇవి సమూహాలుగా సంచరిస్తూ తమ ఆహారం కోసం సులభంగా, ఐక్యంగా చేజిక్కించుకోవడానికి వేటలను కొనసాగిస్తాయి. నీటి నిల్వలు కలిగిన ప్రాంతాలకు ఇతర జంతువులు రావడంతో సింహాలు కూడా ఈ పరిసరాల్లోనే జీవనం కొనసాగిస్తాయి. ఎడారి ప్రాంతాల్లో కూడా నివసించగల సింహాలు తమ దాహం తీర్చుకోవడానికి కొన్ని రకాలైన మొక్కలను లేదా తమ ఆహారం మీద మాత్రమే ఆధారపడి కూడా జీవించగలవు. ఆహారం కోసం జింకలు, జీబ్రాలు, లేళ్లు, అడవి పందులు, కుందేళ్ల వంటి జంతువులను వేటాడుతూ ఒకే సారి 40 కేజీల వరకు మాంసాన్ని (తమ బరువులో 4వ వంతు) తినగలుగుతాయి. రాత్రుల్లో కూడా చూడగలిగే సామర్థ్యం ఉండడంతో ఆడ సింహాలు మాత్రమే అధికంగా తమ ఆహారం కోసం రాత్రుల్లో ఉత్తమ నైపుణ్యంతో గంటకు 50 మైళ్ల వేగంతో పరుగుతీస్తూ, 36 అడుగుల వరకు ఎగురుతూ, దుముకుతూ సమర్థవంతంగా వేటను కొనసాగించగలుగుతాయి. ఏడాదిలో ఒకసారి 1 – 6 పిల్లల్ని కనగలిగే ఆడ సింహాలు 108 రోజుల పాటు గర్భధారణ సమయం తీసుకుంటాయి.

సింహాల ప్రత్యేకతలు:

బలం, ధైర్యం, సమన్యాయం, అధికారం, అభిమానం, వివేకం, ఆధిపత్యం, ఉగ్రత, నాయకత్వం, స్వీయ విశ్వాసం, అహంకారం, గౌరవం వంటి విలువలు సింహాలకు ప్రత్యేకం. సింహం కన్న పులి వేగంగా, తెలివిగా, ప్రమాదకరంగా జీవనం కొనసాగించే అడవికి రాజుగా సింహమే పిలువబడుతున్నది. సింహాలు సమూహాలుగా నివసిస్తూ, వాటిలో ఒకటి నాయకుడిగా వ్యవహరిస్తూ, తమ భూభాగాన్ని రక్షించుకోవడానికి తమ ప్రాణాలను సహితం లెక్కచేయకుండా మొండిగా పోరాడుతాయి. ఆహారం కోసం కాకపోయినా తమ భూభాగాన్ని ఆక్రమించే ప్రయత్నం చేసినప్పుడు కూడా సింహాలు సహించవు. ఇదే తెగువను పులులు ప్రదర్శించని కారణంగా సింహాలను చూసి భయపడి దూరం పోతాయి. తమ కన్న అధిక భారం కలిగిన భారీ జంతువులైన ఏనుగులు, జిరాఫీలు, అడవి దున్నలు, మొసళ్లను సహితం సమూహంగా, సమైక్యంగా వేటాడి చంపగలవు. పెద్ద జూలు, నిర్భయత్వం, రాజసం, సింహ గర్జన, సామూహిక జీవనమే ప్రధానంగా సింహాలు ప్రత్యేకతను సొంతం చేసుకుంటున్నాయి. పొట్టి కాళ్లు, పదునైన గోళ్లు, పొడవైన శరీరం, పెద్ద తల, పసుపు గోధుమ రంగు బొచ్చు, మెడ భుజాలపై మందమైన జుట్టు కలిగిన సింహాలు మాంసాహార జంతువులుగా ప్రత్యేకతను నిలుపుకుంటున్నాయి.

సింహాలకు కేంద్రంగా భారత దేశం:

సింహ జాతిలో 7 ఉపజాతులు ఉన్నాయి. కటంగా, కాంగో, ట్రాన్స్‌వాల్, బార్బరీ, న్యూబియన్, ఏసియాటిక్, వెస్ట్ ఆఫ్రికన్ అనబడే 7 ఉపజాతి సింహాలను గుర్తించారు. 2015 – 2022 మధ్య ఇండియాలో 674 వరకు ఏసియాటిక్ సింహాలు ఉన్నట్లు అంచనా. ప్రపంచంలోనే ఏసియాటిక్ సింహాలు కలిగిన ఏకైక ప్రదేశంగా గుజరాత్‌లోని 'ఘిర్ నేషనల్ ఫారెస్ట్'కు పేరుంది. ఘిర్ ఫారెస్ట్‌లో 2010 వరకు 411 సింహాలు ఉండగా, 2015 వరకు వాటి సంఖ్య 523 వరకు పెరగడం హర్షదాయకం. ఈ పరిస్థితిని గమనించిన కేంద్ర ప్రభుత్వం 'ప్రాజెక్ట్ లయన్' పథకాన్ని ప్రవేశపెడుతూ సింహాల పరిరక్షణకు ప్రయత్నాలు ప్రారంభించడం ముదావహం. 'లయన్‌ఏ2047 : ఏ విజన్ ఫర్ అమృత్‌కాల్' నివేదిక ఆధారంగా గుజరాత్‌లో 'ఘిర్ నేషనల్ పార్క్'తో పాటు 'బర్దా వన్యప్రాణి అభయారణ్యాన్ని' ఏర్పాటు చేసింది. ఘిర్ నేషనల్ పార్క్, ఘిర్ అభయారణ్యాల్లో నివసిస్తున్న ఏసియాటిక్ సింహాల్లో గత 2 – 3 సంవత్సరాల్లో మానవ ప్రమేయంతో పాటు వైరస్ వ్యాధులతో 240 వరకు (36 శాతం) సింహాలు చనిపోయి ఉంటాయనే ప్రమాదకర వార్త బయట పడడం విచారకరం. చెట్లను కూడా ఎక్కగలిగే సింహాల మనుగడ నేడు ప్రశ్నార్థకంగా మారుతున్నది.

ప్రపంచ సింహాల దినం వేదికగా సింహాల మనుగడ పట్ల సాధారణ ప్రజలకు లోతైన అవగాహన కల్పిస్తూ, వాటి ఆవాసాలను పరిరక్షిస్తూ, అడవులను రక్షించుకుంటూ, అభయారణ్యాలను నెలకొల్పుతూ అడవి రాజులకు గొడుగులు పట్టాలి. సింహ రాజుల జనాభా పెరుగుదల యజ్ఞంలో మనందరం పాలుపంచుకోవాలి.


– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# నాన్నే కావాలి ... ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఇంటిపోరు..

**–రోడ్డెక్కిన విభేదాలు..**
**–తండ్రి కోసం కుమార్తెలు నిరసనలు**
**–తమ ఇంటికి రావాలంటూ ఆయన ఇంటి ముందు ధర్నా**
**–మరో మహిళతో తమ తండ్రికి సంబంధం**
**–అందుకే తమను దూరం పెట్టారంటూ ఆవేదన**

శ్రీకాకుళం, ఆగష్టు 9: శ్రీకాకుళం జిల్లాలోని టెక్కలిలో మరోసారి ఎమ్మెల్సీ దువ్వాడ కుటుంబ వ్యవహారం రచ్చకెక్కింది. గత రెండేళ్లుగా కుటుంబంలో విభేదాలు కొనసాగుతున్నాయి. దీంతో వేరు వారు తలుపులు తీయకపోవడంతో ఇంటి బయటే కారులో నిరీక్షించారు. రాత్రి పదిగంటల వరకు పడిగాపులు పడినా దువ్వాడ నుంచి స్పందన లేదు. ఎంత సేపటికీ దువ్వాడ శ్రీనివాస్ తలుపులు తీయకపోవడంతో





వేరుగా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆయన భార్య జెడ్పీటీసీ దువ్వాడ వాణి ఉంటున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో గతంలో వరుసగా ఇంచార్జ్ లను వైసీపీ మార్చింది. ఎన్నికల్లో తనకి టిక్కెట్ కావాలని దువ్వాడ వాణి కోరింది. లెకపోతే భర్తపై రెబల్ గా పోటీ చేస్తానంటూ గతంలో లీకు ఇచ్చింది.. దీంతో రంగంలోకి దిగిన అధిష్టానం సర్ది చెప్పడంతో వాణి వెనక్కి తగ్గింది.

అయితే, తండ్రి దువ్వాడ శ్రీనివాస్ తమ వద్దకు రావాలంటూ గత రాత్రి నుంచి దువ్వాడ కార్యాలయం ముందు ఆయన ఇద్దరు కూతుర్లు నిరసనకు దిగారు. తండ్రి ఇంటి నుంచి బయటకు రావాలంటూ ఆందోళన చేశారు. తమ తండ్రి వేరే మహిళతో ఉంటూ తమను పట్టించుకోవటం లేదనేది ఆయన కుమార్తెలు హైందవి, నవీన ల ప్రధాన ఆరోపణ. ఈ నేపథ్యంలో దువ్వాడ శ్రీనివాస్ ఉంటున్న ఇంటికి కారులో వచ్చారు. అర్ధరాత్రి తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఈ సందర్భంగా పెద్దకుమార్తె హైందవి మాట్లాడుతూ తన భర్త తండ్రి చనిపోయినా.. కనీసం పరామర్శించేందుకు కూడా రాలేదని వాపోయింది. తామెన్నిసార్లు ఫోన్ చేసినా, మెసేజ్‌లు పంపినా వేటికీ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గేటు తీసి లోపలికి వెళ్తామన్న భయంతో . లోపలివైపు తాళాలు వేసేసుకున్నారని వాపోయిందామె.

దువ్వాడ కుటుంబంలో చాన్నాళ్ల నుంచి వివాదాలు ఉన్నాయని ప్రచారం జరుగుతున్నా.. అవి ఇప్పుడు బయట పడ్డాయి. శ్రీనివాస్ కు తమ తల్లితో చట్టపరంగా విడాకులు కాలేదని ఆయన కుమార్తెలు చెబుతున్నారు. కాగా.. మరో మహిళతో ఎలా ఉంటారని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు తమ తండ్రి కలిసి ఉంటున్న మహిళకు గతంలోనే పెళ్లై పిల్లలుకూడా ఉన్నారని, తమ తండ్రిని ట్రాప్ చేసి కుట్రలు పన్నుతోందని ఆరోపించారు.

### ఆయనతో కలిసి ఉండాలని లేదు..

దువ్వాడ శ్రీనివాస్ మరో స్త్రీ తో కలిసి ఉండటంపై భార్య వాణి స్పందించారు. తామిద్దరిదీ ప్రేమ వివాహమని చెప్పారామె. తన తల్లిదండ్రులు ఒక పాప పుట్టాక కూడా పై చదువులు చదువుకోమని చెప్పినా తనకు బంధాలు, విలువలు అడ్డొచ్చాయన్నారు. ఆయనలో కోపం చూశానని, తనను హెరాస్ చేసేవాడని చెప్పుకొచ్చారు. ఆయన రాజకీయాలతో తామెంతో నష్టపోయామని, ఎన్నో కుటుంబాలు అన్యాయమైపోయారని వాపోయారు. దువ్వాడ శ్రీనివాస్ గడప గడపకు వైసీపీ కార్యక్రమం జరుగుతున్నప్పుడు వేరే ఆమెతో ఉండటం చూసిన వారంతా తనకు చెప్పారని, వారంతా అసహ్యించుకునే విధంగా నడుచుకున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు.

ఏదేమైనా దువ్వాడ శ్రీనివాస్ వల్ల తమ కుటుంబం పరువుపోతోందన్నారు. ఆయన నుంచి తమకెలాంటి ఆస్తులు రాలేదని, ఆయన టెక్కలి వదిలి వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. ఆయన నుంచి తనకొక్క రూపాయి కూడా అక్కర్లేదని, పిల్లల బాధ్యత మాత్రం ఆయనే చూసుకోవాలన్నారు.

# మోడువారిన బతుకుల్లో మోదుగు పూల పరిమళాలు..: హరీశ్‌రావు

హైదరాబాద్, ఆగష్టు 9: ప్రపంచ ఆదివాసీ దినోత్సం సందర్భంగా ఆదివాసీ, గిరిజనులకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. విధ్వంసపు దారుల నుంచి వికసిత తోవలు.. మోడువారిన బతుకుల్లో మోదుగు పూల పరిమళాలు గుభాలిస్తున్నాయని చెప్పారు. గిరిజనులు, ఆదివాసీల దశాబ్దాల డిమాండ్లను నెరవేర్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. ఆదివాసీల మూడు డిమాండ్లయిన స్వయంపాలన, రిజర్వేషన్ల పెంపు, పోడు భూముల పట్టాలను కేసీఆర్ నిజం చేశారని తెలిపారు.

మావ నాటే మావ రాజ్.. మా తాండాలో మా రాజ్యం అనే ఆదివాసీల ప్రజాస్వామిక ఆకాంక్షను సాకారం చేస్తూ 2,471 గూడేలను, తాండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి ఆదివాసీ గిరిజనుల ఆకాంక్షలను నెరవేర్చారని చెప్పారు. విద్య, ఉద్యోగ రంగాల్లో ఆదివాసీ గిరిజనుల భాగస్వామ్యాన్ని మరింతగా పెంచేందుకు వారికి 10 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తూ దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని వెల్లడించారు. జల్.. జంగల్.. జమీన్ అన్న కొమురం భీమ్ నినాదాన్ని కేసీఆర్ నిజం చేశారన్నారు.

# 'డిడియుజిజెవై' కింద లబ్ధిదారులు

న్యూఢిల్లీ, ఆగష్టు 9: దేశంలో వివిధ గ్రామీణ విద్యుదీకరణ పనుల నిమిత్తం కేంద్ర ప్రభుత్వం 2014 డిసెంబరులో 'దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజన' (డిడియుజిజెవై)ను ప్రారంభించింది. దీనికింద వ్యవసాయం- వ్యవసాయేతర ఫీడర్ల విభజన, సబ్ ట్రాన్స్ మిషన్-పంపిణీ మౌలిక సదుపాయాల విస్తరణ-బలోపేతం, పంపిణీ ట్రాన్స్ ఫార్మర్లు/ఫీడర్లు మీటర్ల ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేపడతారు. అలాగే గ్రామీణ విద్యుదీకరణలో భాగంగా దారిద్ర్య రేఖకు దిగువనున్న (బిపిఎల్) కుటుంబాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు కూడా ఇస్తారు.

అలాగే సౌభాగ్య పథకం పరిధిలో లేని విద్యుత్తు సదుపా యరహిత కుటుంబాల కోసం ఆయా రాష్ట్రాల ప్రతిపాదన మేరకు 'డిడియుజిజెవై' కింద గృహ విద్యుదీకరణ పనులను కూడా పూర్తిచేశారు. ఈ విధంగా విద్యుదీకరణ చేసిన గృహాల సంఖ్యను రాజస్థాన్ సహా రాష్ట్రాలు/సంవత్సరాల వారీగా అనుబంధం-ఎలో చూడవచ్చు.రాజస్థాన్ ప్రభుత్వ నివేదిక ప్రకారం- ఆ రాష్ట్రంలోని షెడ్యూల్డ్ ప్రాంత సంబంధిత ప్రత్యేక సమాచారం అందుబాటులో లేదు. అయితే, ఆ ప్రాంతాల్లోని వారు సహా రాష్ట్ర జనాభా మొత్తానికీ 'డిడియుజిజెవై' ద్వారా ప్రయోజనం చేకూరింది. ఈ విధంగా లబ్ధిపొందిన కుటుంబాల జిల్లాల వారీ వివరాలను అనుబంధం-ఎలో చూడవచ్చు.కాగా, 'డిడియుజిజెవై' కింద నిర్దేశిత పనులన్నీ పూరి్తకావడంతో 31.03.2022 నాటికి ఈ పథకానికి ప్రభుత్వం ముగింపు పలికింది.కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీ శ్రీపాద్ యశోనాయక్ లోక్‌సభలో ఇవాళ ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ ఈ సమాచారం వెల్లడించారు.

# అదివాసీల జీవన ప్రమాణాలు మెరుగు పరుస్తాం-చంద్రబాబు



విజయవాడ, ఆగష్టు 9: మైదాన ప్రాంతాల్లో ఉన్న ఆదివాసీల జీవన ప్రమాణాలు, పరిస్థితులు ఇప్పటికీ దుర్భరంగానే ఉన్నాయని, గత ప్రభుత్వం ఆదివాసీలను పట్టించుకోలేదని విమర్శించారు సీఎం చంద్రబాబు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీల దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఆయనకు ఆదివాసీలు సంప్రదాయ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆదివాసీల డప్పును మోగించారు. వారితో కలిసి నృత్యం చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లలో గిరిజన ఉత్పత్తులను పరిశీలించారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఆదివాసీలు తమ కష్టాలను, సమస్యలను చెప్పే అవకాశం లేకుండా చేశారని, గడిచిన ఐదేళ్లలో ఆదివాసీలను పట్టించుకోలేదన్నారు. ఆదివాసీల కోసమే అరకు కాఫీని పెద్ద ఎత్తున ప్రమోట్ చేశామని, ప్రధాని మోదీనే దానికి బ్రాండ్ అంబాసిడర్ గా నిలిచారన్నారు. పారిస్ లో కూడా మన అరకు కాఫీ అమ్ముడవుతుందని గర్వంగా చెప్పారు సీఎం. గిరిజనులు ఆర్గానిక్ ఉత్పత్తులను పండిస్తారని, మెడిసినల్ వాల్యూ ఉండే ఉత్పత్తులన్నీ అడవుల్లోనే దొరుకుతాయని తెలిపారు. మనకు నాణ్యమైన తేనె కూడా అడవుల్లోనే దొరుకుతుందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో 6 లక్షల ఆదివాసీ కుటుంబాలు ఉన్నాయని, మారుమూల ప్రాంతాల్లో ఉన్న గిరిజనులకు న్యాయం చేయడమే తమ లక్ష్యమన్నారు. గిరిజనులు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆదర్శంగా తీసుకుని ఎదగాలని సూచించారు. దేశంలో తలసరి ఆదాయం లక్షా 72 వేలు ఉండగా.. ఆంధ్రప్రదేశ్ లో తలసరి ఆదాయం 2 లక్షల 20 వేలు ఉందని, తెలంగాణలో తలసరి ఆదాయం 3 లక్షల 20 వేల రూపాయలు ఉందన్నారు. అక్కడ గతంలో తాము చేసిన అభివృద్ధితో ఇప్పుడు తలసరి ఆదాయం పెరిగిందని చెప్పుకొచ్చారు చంద్రబాబు.

ఏపీలోని గిరిజన ప్రాంతాల్లో మాత్రం ఆదివాసీల తలసరి ఆదాయం లక్షా 25 వేల రూపాయలుగానే ఉందని.. ఇతరుల కంటే వీరి ఆదాయం లక్ష తక్కువగా ఉందని, ఇది సమంజసం కాదన్నారు. గిరిజనుల తలసరి ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఇంకా డోలీలు కనిపించడం దురదృష్టకరమని, ఆదివాసీలను పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చి ఆదుకునేంతవరకూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

2014–19 టీడీపీ హయాంలో ఆదివాసీల కోసం 16 పథకాలు, సుమారు 199 గురుకుల పాఠశాలలు, 2,705 విద్యాసంస్థలను ఏర్పాటు చేసి 2 లక్షల పై మందికి పైగా విద్యార్థులకు విద్యను అందించామని గుర్తు చేశారు.

# బాయిలర్స్ బిల్ 2024ను రాజ్యసభలో ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఆగష్టు 9: బాయిలర్స్ బిల్ 2024ను ఆగష్టు 8 గురువారం కేంద్ర వాణిజ్య ,పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పియూష్ గోయల్ రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు బాయిలర్స్ చట్టం ,1923 (5 ఆఫ్ 1923)ను రద్దు చేస్తుంది.

అంతకుముందు, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఆగస్టు 2న కేంద్ర కేబినెట్ సమావేశమై 1923నాటి ప్రస్తుత బాయిలర్ చట్టాన్ని రద్దుచేసేందుకు , దాని స్థానంలో బాయిలర్స్ బిల్లు ,2024 ను పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు ఆమోదం తెలిపింది. ఈ బిల్లులోని ముఖ్యాంశాలు కింది విధంగా ఉన్నాయి.

ఆధునిక బిల్లు రూపకల్పన పద్ధతులకు అనుగుణంగా , బిల్లులోని ప్రొవిజన్లకు మరింత స్పష్టత నిచ్చేలా ఈ బిల్లును రూపొందించారు. బాయిలర్స్ చట్టం 1923లో ఒకే రకమైన ప్రొవిజన్లు వివిధ చోట్ల ఉండడంతో అలాంటి వాటిని కొత్త బిల్లులోని ఆరు చాప్టర్లలో ఒక చోట చేర్చారు. దీనివల్ల ఈ ప్రొవిజన్లను సులభంగా చదవడానికి,అర్థం చేసుకోవడానికి వీలు కలుగుతుంది.

కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వాలు, కేంద్ర బాయిలర్స్ బోర్డుల విధులు, అధికారాలను ఎలాంటి గందరగోళానికి తావులేకుండా, సవివరంగా పొందుపరిచారు.

సులభతర వ్యాపారానికి (ఇఒడిబి) వీలుగా ఈ బిల్లు బాయిలర్లను ఉపయోగించే వారికి , ఎం.ఎస్.ఎం.ఇ రంగంలోని వారితో సహా అందరికీ ప్రయోజనం కలిగించనుంది. ఇందుకు అనుగుణంగా ఈ బిల్లులో కొన్ని నేరాలను , క్రిమినల్ నేరాల పరిధి నుంచి తొలగించే ప్రొవిజన్లను చేర్చారు. బాయిలర్ల భద్రత, బాయిలర్లను పనిచేయించే వారి భద్రత ను దృష్టిలో ఉంచుకుని ప్రాణ, ఆస్తి నష్టం కలిగించే ఏడు నేరాలలోని నాలుగు ప్రధాన నేరాల విషయంలో క్రిమినల్ పెనాల్టీలను అలాగే ఉంచారు. మిగిలిన నేరాల విషయంలో ఆర్థిక పెనాల్టీలకు వీలుగా ప్రొవిజన్లు ఉండనున్నాయి. దీనికితోడు, క్రిమినల్ నేరాల పరిధిలోకి రాని వాటి విషయంలో ఫైన్ ను పెనాల్టీగా మార్చి, ఇంతకు ముందులా కోర్టులు విధించేలా కాకుండా దీనిని ఎగ్జిక్యూటివ్ యంత్రాంగం విధించేలా చూడనున్నారు. ప్రతిపాదిత బిల్లు కార్మికుల భద్రతను మరింత పెంచనుంది. ఇందులో బాయిలర్లో పనిచేసేవారి భద్రతకు వీలు కల్పించారు. అలాగే బాయిలర్ రిపేర్ పనులను తగిన అర్హతలుగల, సమర్థులతో చేయించేలా చూడనున్నారు.

రాజ్యాంగం అమలులోకి రాకముందు ఉన్న అన్ని చట్టాలను అవి ప్రస్తుత కాలానికి ఏమేరకు పనికివస్తాయన్న దానిని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది.

బాయిలర్స్ చట్టం 1923 , రాజ్యాంగం అమలులోకి రాకముందరి చట్టం. ఇది బాయిలర్ల విషయంలో ప్రాణ రక్షణ, ఆస్తి రక్షణకు సంబంధించినది. అందువల్ల ప్రస్తుత చట్టంలోని ప్రొవిజన్లను సమీక్షించి , కొత్త బాయిలర్స్ బిల్లు 2024ను పార్లమెంటులో ప్రవేశపెట్టడం అవసరమని కేంద్ర ప్రభుత్వం భావించింది.

బాయిలర్స్ బిల్లును 2007 వ సంవత్సరంలో సమగ్రంగా సవరిస్తూ ఇండియన్ బాయిలర్స్ (సవరణ)చట్టం 2007 ను తీసుకువచ్చారు. ఇందులో తనిఖీ , సర్టిఫికేషన్ వంటి వాటిని స్వతంత్ర తృతీయపక్షం తనిఖీ అథారిటీలకు అప్పగించే అంశాన్ని ప్రవేశపెట్టారు. అయితే, తదుపరి ప్రస్తుత చట్టాన్ని సమీక్షించిన మీదట, జనవిశ్వాస్ (సవరణ ప్రొవిజన్ల) చట్టం 2023కు అనుగుణంగా క్రిమినల్ నేరాలనుంచి తొలగించే ప్రొవిజన్లను చేర్చాల్సిన అవసరాన్ని గుర్తించారు.

ఆమేరకు ప్రస్తుత చట్టాన్ని సమీక్షించి, ఈ చట్టంలో పనికిరాని, కాలం చెల్లిన ప్రొవిజన్లను మినహాయించి, గతంలో లేని, మరింత స్పష్టత నిచ్చే ప్రొవిజన్లు, నిబంధనలను చేర్చారు. కొన్ని కొత్త నిర్వచనాలనిచ్చి, ప్రస్తుతం ఉన్న కొన్ని నిర్వచనాలను సవరించి మరింత స్పష్టతనిచ్చేలా బిల్లులో ప్రొవిజన్లను చేర్చారు.

# సుబ్బారాయుడు కుటుంబానికి జగన్ పరామర్శ..

అమరావతి, ఆగష్టు 9: వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నంద్యాల పర్యటనలో ఉన్నారు. ఇటీవలే హత్యకు గురైన సుబ్బారాయుడు కుటుంబాన్ని జగన్ పరామర్శించారు. నంద్యాల పర్యటనకు వచ్చిన సందర్భంగా జగన్ నాయకులు ఘన స్వాగతం పలికారు.

నంద్యాల పర్యటనలో భాగంగా వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇవాళ మధ్యాహ్నం ఓర్వకల్లు ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు.

ఈ సందర్భంగా వైసీపీ శ్రేణులు, నేతలు, కార్యకర్తలు, అభిమానులు విమానాశ్రయం వద్ద ఆయనకు ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి నంద్యాల బయలుదేరిన ఆయనకు ఓర్వకల్లు నుంచి దారి పొడవునా అడుగడుగునా జనం నీరాజనం పలకడం గమనార్హం.

ఆయనకు ఘన స్వాగతం పలికిన వారిలో కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, హఫీస్ ఖాన్, కర్నూల్ మేయర్ బివై రామయ్య, తదితరులు ఉన్నారు.


ఆహ్వానం

తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో
మహాకవి సినారె కళాపీఠం
( సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థ )



మహాకవి డా॥ సి.నారాయణ రెడ్డి గారి 93వ జయంతి సందర్భంగా
సినారె సాహిత్య పురస్కారాల ప్రదానం

ముఖ్య అతిథి : డా॥ జిల్లేల చిన్నారెడ్డి గారు
తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు
సభాధ్యక్షులు : డా॥ నందిని సిధారెడ్డి గారు ప్రముఖకవి
తెలంగాణ సాహిత్య అకాడమి తొలి అధ్యక్షులు
విశిష్ట అతిథి : శ్రీ మల్‌రెడ్డి రంగారెడ్డి గారు
శాసనసభ్యులు, ఇబ్రహీంపట్నం
ప్రత్యేక అతిథి : శ్రీ బైస దేవదాసు గారు
'నేటినిజం' దినపత్రిక సంపాదకులు
ఆత్మీయ అతిథులు : డా॥ గంటా జలంధర్ రెడ్డి గారు
అధ్యక్షులు, తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి
శ్రీ దాసరి దయానంద్ రెడ్డి గారు
ప్రముఖ సామాజ సేవకులు
శ్రీ కనుమను సునీల్ గారు
కౌన్సిలర్, (కమ్మగూడ) తుర్కయంజాల్ మున్సిపాలిటీ
కార్యక్రమ సమన్వయం : డా॥ పోరెడ్డి రంగయ్య గారు
అధ్యక్షులు, తేజ సాహిత్య సేవా సంస్థ

మహాకవి సినారె సాహిత్య పురస్కారాలు - 2024

జీవన సాఫల్య పురస్కార స్వీకర్త
డా॥ టి. గౌరీశంకర్ గారు, ప్రముఖ సాహితీవేత్త
పూర్వ రిజిస్ట్రార్, తెలుగు విశ్వవిద్యాలయం

సాహితీ పురస్కార గ్రహీతలు
డా॥ చీవెళ్ళ సీతాలక్ష్మి గారు
హైదరాబాద్
శ్రీ కన్నోజు లక్ష్మీకాంతం గారు
హైదరాబాద్
శ్రీ సంగెనేని రవీందర్ గారు
ముంబయి, మహారాష్ట్ర
శ్రీ వై.హెచ్.కె. మోహన్ రావు గారు
పిడుగురాళ్ళ, పల్నాడు, ఆంధ్రప్రదేశ్
శ్రీమతి సమ్మెట ఉమాదేవి గారు
ఖమ్మం
శ్రీ బూర్ల వెంకటేశ్వర్లు గారు
కరీంనగర్
శ్రీ బిల్ల మహేందర్ గారు
వరంగల్
డా॥ కాసర్ల నరేశ్ రావు గారు
నిజామాబాద్
శ్రీ ద్యావరి నరేందర్ రెడ్డి గారు
రంగారెడ్డి

ఏ.బి.ఆర్. కన్వెన్షన్ ఏ/సి బాంక్వెట్ హాల్
(ఎ.ఆర్.ఆర్. కాంప్లెక్స్) తుర్కయంజాల్ (సాగర్ రోడ్) హైదరాబాద్
తేది: 10-08-2024 (శనివారం) సమయం: ఉ॥ 10.00 గం॥లకు

ఆహ్వానించువారు
మల్లెకేడి రాములు, అధ్యక్షులు
మహాకవి సినారె కళాపీఠం సెల్: 8897726645

# గనులు, ఖనిజాల రంగం పరిశ్రమ నేతలతో సమావేశం

# జరిపిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, ఆగష్టు 9: మైనింగ్, జియోలాజికల్, మెటలర్జికల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎం జి ఎం ఐ ) ఆధ్వర్యంలో గనులు, ఖనిజాల రంగంలో సవాళ్లు, అవకాశాలపై ఢిల్లీలో జరిగిన జాతీయ సదస్సులో లో బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి ప్రసంగించారు. గనుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ వి.ఎల్.కాంతారావుతో పాటు బొగ్గు మంత్రిత్వ శాఖ, గనుల మంత్రిత్వ శాఖకు చెందిన ఇతర సీనియర్ అధికారులు, ప్రభుత్వ బొగ్గు , గనుల రంగ వాటాదారులు ఈ సదస్సు లో పాల్గొన్నారు.

గనులు, అన్వేషణ పరిశ్రమలకు సంబంధించిన ప్రైవేటు, ప్రభుత్వ రంగ కంపెనీల సి ఇ ఒ లతో శ్రీ కిషన్ రెడ్డి ఈ సందర్భంగా నిర్మాణాత్మక చర్చలు జరిపారు. ఇందులో పరిశ్రమ ప్రతినిధులు తాము ఎదుర్కొంటున్న సవాళ్లను మంత్రి దృష్టికి తెచ్చారు. వాటిని అధిగమించడానికి విలువైన ప్రతిపాదనలు, సలహాలు, సిఫారసులను అందించారు.

వారు ప్రస్తావించిన అన్ని అంశాలు, ప్రతిపాదిత విధాన సూచనలను మంత్రిత్వ శాఖ క్షుణ్ణంగా సమీక్షించి చర్చిస్తుందని, సత్వర చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. పాల్గొన్న ప్రతినిధులకు శ్రీ రెడ్డి కృతజ్ఞతలు చెబుతూ, ఇలాగే ఎప్పటికప్పుడు సమాచారం పంచుకోవాలని కోరారు. సుపరిపాలనకు ఇటువంటి పరస్పర సమావేశాలు కీలకమని , ఇది పరిశ్రమ విశిష్ట స్వభావాన్ని , ప్రభుత్వ ప్రయత్నాలతో బలమైన సమన్వయం ప్రాముఖ్యతను ప్రదర్శిస్తాయని ఆయన చెప్పారు.

పారిశ్రామికవేత్తల సమావేశంలో శ్రీ కిషన్ రెడ్డి ప్రసంగిస్తూ, భారతదేశ విస్తారమైన సహజ వనరులు వికసిత్ భారత్ - 2047 వైపు దేశం ప్రయాణానికి, చిత్తశుద్ధితో ఆత్మనిర్భరతను సాధించడానికి కీలకం అవుతాయని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో బొగ్గు, ఖనిజ రంగంలో ప్రభుత్వం సమూల మార్పును తీసుకువచ్చిందని, ఇది పారదర్శకంగా, పోటీ దాయకంగా మారిందని ఆయన అన్నారు. బొగ్గు, ఖనిజ బ్లాకులకు వాణిజ్య వేలం విధానాన్ని ప్రవేశపెట్టడం, ప్రైవేటు రంగ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వంటి కార్యక్రమాల ద్వారా ఈ సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకోవడానికి గత దశాబ్దకాలంగా ప్రభుత్వం చేస్తున్న విస్తృత ప్రయత్నాలను ఆయన వివరించారు.

క్లిష్ట ఖనిజాలు (క్రిటికల్ మినరల్స్) ఆధునిక ఆర్థిక వ్యవస్థకు చోదకశక్తిగా ఆవిర్భవించాయని, నేషనల్ క్రిటికల్ మినరల్స్ మిషన్ ను ప్రారంభించడం ద్వారా దేశం ఈ అంతర్జాతీయ అవకాశాన్ని అందిపుచ్చుకునేలా భారత ప్రభుత్వం చర్యలు తీసుకుందని మంత్రి పేర్కొన్నారు.

ప్రైవేట్ రంగ భాగస్వామ్యం ప్రాముఖ్యతను కూడా మంత్రి నొక్కి చెప్పారు భారతదేశ ఈ విస్తరణవంతమైన వృద్ధి కథలో భాగస్వాములు కావాలని పరిశ్రమ నాయకులకు పిలుపునిచ్చారు. సులభ వ్యాపారాన్ని పెంపొందించడానికి, వారి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి , దానితో ముడిపడి ఉన్న ప్రమాదాలను తగ్గించడానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని ఆయన చెప్పారు. ఎక్స్ ప్లోరేషన్ లైసెన్స్, కాంపోజిట్ లైసెన్స్ హోల్డర్లకు 50% అన్వేషణ వ్యయాన్ని రీయింబర్స్ చేయడం వంటి కార్యక్రమాలు ఎక్కువ భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తాయని ఆయన పేర్కొన్నారు.

బొగ్గు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, దేశీయ బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి తీసుకుంటున్న చర్యలను శ్రీ కిషన్ రెడ్డి వివరించారు. 2030 నాటికి 140 మిలియన్ టన్నుల కోకింగ్ బొగ్గును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న మిషన్ కోకింగ్ కోల్, జాతీయ ఖనిజ విధానం 2019 ద్వారా సుస్థిర మైనింగ్ పద్ధతులను పెంపొందించే ప్రయత్నాలు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వంటి కార్యక్రమాలను శ్రీ రెడ్డి ప్రస్తావించారు. దిగుమతి భారాన్ని తగ్గించడానికి, దేశీయ పూర్తి అవసరాలను తీర్చడానికి కోల్ ఇండియా ఇప్పటికే ఉన్న వాషరీలను మెరుగుపరచడం , కొత్త వాటిని ఏర్పాటు చేయడంపై దృష్టి పెట్టడం చాలా ముఖ్యమని ఆయన అన్నారు. మిషన్ కోకింగ్ కోల్ వంటి కార్యక్రమాలు , వాషరీస్ సామర్థ్యాన్ని పెంచడంపై దృష్టి పెట్టడం వంటి కార్యక్రమాలు భారతదేశ బొగ్గు పర్యావరణ వ్యవస్థలో మార్పుకు నాంది పలుకుతాయని అన్నారు.

ఖనిజాల విషయంలో, వాటి అన్వేషణకు విస్తృత పెట్టుబడుల అవసరాన్ని శ్రీరెడ్డి అంగీకరించారు . మన సామర్థ్యాలను పెంచడానికి మరింత పరిశోధన, శాస్త్రీయ విచారణ , సహకారాల అవసరాన్ని నొక్కి చెప్పారు.

సుస్థిర మైనింగ్ లక్ష్యానికి అనుగుణంగా, 2029-30 నాటికి 100 మిలియన్ టన్నులను సాధించాలనే లక్ష్యంతో భూగర్భ గనుల త్రవ్వకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు శ్రీ కిషన్ రెడ్డి చెప్పారు. ఇందుకు అనుగుణంగా బొగ్గు గ్యాసిఫికేషన్, కోల్ బెడ్ మిథేన్ (సిబిఎం) వాయువుల వెలికితీత, బొగ్గు నుంచి హైడ్రోజన్ ప్రక్రియల అన్వేషణ, కార్బన్ క్యాప్చర్ అండ్ స్టోరేజ్ (సిసిఎస్) తో సహా స్వచ్ఛమైన ఇంధన సాంకేతికతలను అభివృద్ధి చేయడానికి అనేక చర్యలు తీసుకుంటున్నారు.

మైనింగ్ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆవిష్కరణలను పెంపొందించడంలో ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని పారిశ్రామిక ప్రతినిధులకు మంత్రి పిలుపునిచ్చారు. సుస్థిర మైనింగ్ రంగంలో సవాళ్లు, పరిష్కారాలపై నేటి సదస్సు సమగ్ర చర్చకు దోహదపడుతుందని భావిస్తున్నాను. సమీప భవిష్యత్తులో భారత్ ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంలో ప్రైవేటు రంగ ఆవిష్కరణలు, కష్టనష్టాలను (రిస్క్) లెక్క చేయకుండా ముందుకు వెళ్ళడం కీలకం కానున్నాయి" అని ఆయన అన్నారు.

పారిశ్రామిక వృద్ధి , సుస్థిర అభివృద్ధి రెండింటి పట్ల ప్రభుత్వ నిబద్ధతను చాటి చెబుతూ ఈ సదస్సు భారతదేశ మైనింగ్ , ఖనిజాల రంగం భవిష్యత్తుపై బలమైన చర్చలకు , ఆలోచనలను పరస్పరం పంచుకోవడానికి ఒక వేదికను అందించింది,

# నిందితులకు శిక్ష పడేలా చూడాలి- సీపీ శ్రీనివాస్

## -కోర్టు కానిస్టేబుల్ బాధ్యత చాలా కీలకం
## -పోలీసులపై నమ్మకం పెరిగేలా పనిచేయాలి

కరీంనగర్, ఆగష్టు 9: కోర్టు డ్యూటీ ఆఫీసర్లు నేరస్థులు శిక్షల నుండి తప్పించుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించి నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలని రామగుండం పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్ ఆదేశించారు. శుక్రవారం పెద్దపెల్లి జిల్లా రామగుండం కమిషనరేట్ ఆవరణలో కమిషనరేట్ పరిదిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న కోర్టు డ్యూటీ ఆఫీసర్స్, కోర్టు లైసెన్ ఆఫీసర్స్ తో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. కోర్టు కానిస్టేబుల్ కోర్టు కేలండర్ తయారు చేసుకోవాలని, నిందితులకు శిక్షలు పడే విధంగా సాక్షులను మోటివేషన్ చేయాలన్నారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని, షెడ్యూల్ ప్రకారం సాక్షులను కోర్టులో హాజరుపర్చాలన్నారు. పెండింగ్, పెట్టి కేసులను వెంటనే డిస్పోజల్ చేయాలని, నేరస్తులకు శిక్షలు పడితే నేరాలు తగ్గుముఖం పడతాయన్నారు. కోర్టు కానిస్టేబుల్ బాధ్యత చాలా కీలకమైనదని, నేర రహిత సమాజంగా తీర్చిదిద్దాలంటే నిందితులకు కోర్టులో శిక్షపడే విధంగా కోర్టు డ్యూటీ పోలీసు సిబ్బంది శ్రమించాలన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు అయినప్పటి నుండి కేసు పూర్తయ్యేంత వరకు నిందితుల నేరాలను నిరూపించేందుకు అవసరమైన రుజువులు, పత్రాలు, సాక్షుల వాంగ్మూలాలను కోర్టుకు సమర్పించడంలో కోర్టు కానిస్టేబుల్ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కోర్టుకు ఎఫ్ఐఆర్ లను సరైన సమయంలో అందించాలని, కేసుల్లో ఉన్నటువంటి ప్రాపర్టీని సరైన సమయంలో కోర్టులో డిపాజిట్ చేయాలన్నారు. కోర్టులో బాధితులకు న్యాయం జరిగే విధంగా నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషిచేయాలని, నేరస్తులకు వారంట్స్, సమన్స్, సత్వరమే ఎగ్జిక్యూటివ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టు ప్రాసిక్యూషన్ కు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్ కు తెలియజేయాలని, కోర్టు క్యాలెండర్ ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని, కేసు ట్రయల్స్ సమయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సలహాలు, సూచనలు పాటించాలన్నారు.



భాదితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, బాధితులకు పోలీసులపై నమ్మకం పెరిగేలా ప్రతి ఒక్క అధికారి పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ అడ్మిన్ సి.రాజు, గోదావరి ఖని ఏసీపీ రమేష్, పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, ఎస్ బీ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఏసీపీ ప్రతాప్, సీసీ ఆర్ బీ ఇన్ స్పెక్టర్ బుద్దే స్వామి, పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక తవ్వకాలు

న్యూఢిల్లీ, ఆగష్టు 9: గనులు, ఖనిజాల(అభివృద్ధి, నియంత్రణ) చట్టం - 1957(ఎంఎండీఆర్ చట్టం 1957)లోని సెక్షన్3(ఇ) ఇసుకను ఉప ఖనిజం(మైనర్ మినరల్)గా పేర్కొంది. గనులు, ఖనిజాల(అభివృద్ధి, నియంత్రణ) చట్టం - 1957(ఎంఎండీఆర్ చట్టం)లోని నిబంధనల ప్రకారం ఇసుక తవ్వకాల క్రమబద్ధీకరణ జరుగుతుంది. ఈ చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు / కేంద్రపాలిత ప్రాంతాల(యూటీ) అధికార యంత్రాంగాలు ఖనిజ రాయితీ నియమాలను రూపొందిస్తాయి. దీంతో పాటు ఖనిజాల అక్రమ తవ్వకాలు, రవాణా, నిల్వ, ఇందుకు సంబంధించిన ఇతర చర్యలను నియంత్రించడానికి, సుస్థిరమైన ఇసుక తవ్వకాల మార్గదర్శకాలకు సంబంధించిన వివిధ నిబంధనలు అమలయ్యేలా చూడటానికి రాష్ట్ర ప్రభుత్వాలు / కేంద్రపాలిత ప్రాంతాల(యూటీ) అధికార యంత్రాంగాలకు ఎంఎండీఆర్ చట్టంలోని సెక్షన్ 23సీ అధికారాలు కల్పించింది.

అక్రమ ఇసుక తవ్వకాల వల్ల నదీగర్భం క్షీణించడం, నీటిలోని జీవాలకు నష్టం, టర్బిడిటీ పెరగడం, నీటిమట్టం తగ్గడం, నేల కోతకు గురవడం, వరదలు సంభవించడం, మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లడం, సారవంతమైన భూమికి నష్టం జరగడం వంటి పర్యావరణ నష్టాలు కలుగుతాయి. స్థానిక పర్యావరణ వ్యవస్థపై నీటి నాణ్యత తగ్గడం లాంటి ప్రతికూల ప్రభావం పడటంతో పాటు నదీతీర ప్రాంతంలో పర్యావరణ సమతుల్యతపై ప్రమాదకర రీతిలో ప్రభావం పడుతుంది.

న్యాయబద్ధమైన ఇసుక తవ్వకాలు నిర్దేశిత పరిమితులకు లోబడి ఉండాలి. న్యాయబద్ధమైన ఇసుక తవ్వకాలకు పర్యావరణ ప్రభావ మదింపు(ఈఐఏ) నోటిఫికేషన్ ఎన్.ఓ.1533(ఈ) తేదీ 14.09.2006, ఆ తర్వాత వచ్చిన సవరణల ప్రకారం, ఆమోదిత తవ్వకాల ప్రణాళిక మేరకు రాష్ట్ర పర్యావరణ ప్రభావ మదింపు సంస్థ(ఎస్ఈఐఏఏ) పర్యావరణ అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. సుస్థిరమైన ఇసుక తవ్వకాలు, పర్యావరణ అనుకూల నిర్వహణ పద్ధతులను చేపట్టడానికి గానూ సముచిత నియంత్రణ విధానాన్ని అమలు చేయడానికి మంత్రిత్వ శాఖ కూడా సుస్థిర ఇసుక తవ్వకాల మార్గదర్శకాలు - 2016, ఇసుక తవ్వకాల అదుపు, పర్యవేక్షణ మార్గదర్శకాలు - 2020ను జారీ చేసింది. ఏ పరిణామంలో, ఎంత లోతులో ఇసుక తవ్వాలి వంటి నిర్దిష్ట షరతుల మేరకు పర్యావరణ అనుమతులు జారీ చేయడం జరుగుతుంది. తవ్వకాల పరిమితిని రాష్ట్ర స్థాయి నిపుణుల అంచనా కమిటీ(ఎస్ఈఏసీ) సిఫార్సు చేస్తుంది. నీటి ప్రవాహం తీరు, ప్రవాహ పరిమాణం, నది వెడల్పు, సామర్థ్యాన్ని తిరిగి భర్తీ చేయడం, వృద్ధితో పాటు క్షీణత స్థాయి, ప్రజా మౌలిక సదుపాయాల స్థితి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ఇసుక తవ్వకాల ప్రతిపాదనలను విడివిడిగా పరిశీలించిన తర్వాత ఎస్ఈఐఏఏ అనుమతి ఇస్తుంది. "సుస్థిరమైన ఇసుక తవ్వకాల నిబంధనలు - 2016"తో పాటు మంత్రిత్వ శాఖ జారీ చేసిన "ఇసుక తవ్వకాల అదుపు, పర్యవేక్షణ మార్గదర్శకాలు(ఈఎంజీఎస్ఎం) - 2020" మేరకు అనుమతి ఇస్తుంది. ఇసుక తవ్వకాలపై జిల్లా సర్వే నివేదిక తయారీ ప్రక్రియను ఎన్.ఓ. 3611(ఈ) ద్వారా తేదీ 25, జూలై 2018 మంత్రిత్వ శాఖ నిర్దేశించింది. మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఈ మార్గదర్శకాల ప్రకారం.. పర్యావరణ అనుమతి, నివేదికల తయారీ, ప్రాజెక్టు మదింపు జిల్లా సర్వే నివేదిక ఆధారంగా ఉంటుంది. ఈ నివేదికను ప్రతి ఐదేళ్లకు ఒకసారి నవీకరించాల్సి ఉంటుంది. అనేక చర్చలు, లోతైన విశ్లేషణ తర్వాత మంత్రిత్వ శాఖ ఈ నిబంధనలను నిర్దేశించింది. ఈ విధానాలు ఉప ఖనిజాల(మైనర్ మినరల్స్) తవ్వకాలకు సంబంధించి శాస్త్రీయ, క్రమబద్ధమైన, పర్యావరణ అనుకూల పద్ధతులను ప్రోత్సహిస్తున్నాయి.

ఏరియల్ సర్వే చేయడం, రిమోట్ సెన్సింగ్, జీఐఎస్ అప్లికేషన్ల వినియోగం వంటి వాటిని "సుస్థిర ఇసుక తవ్వకాల మార్గదర్శకాలు - 2016", "ఇసుక తవ్వకాల అదుపు, పర్యవేక్షణ మార్గదర్శకాలు - 2020"లో పొందుపర్చడం జరిగింది. దేశంలో అక్రమ మైనింగ్ చర్యలను నిర్మూలించడానికి గానూ అంతరిక్ష సాంకేతికతను వినియోగించేందుకు గాంధీనగర్‌లోని భాస్కరాచార్య ఇన్స్టిట్యూట్ ఫర్ స్పేస్ అప్లికేషన్స్ అండ్ జియో-ఇన్ఫార్మేటిక్స్ (బీఐఎస్ఏజీ), ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ(ఎంఈఐటీవై) భాగస్వామ్యంతో ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ ద్వారా గనుల నిఘా వ్యవస్థ(ఎంఎస్ఎస్)ను గనుల మంత్రిత్వ శాఖ అభివృద్ధి చేసింది.

ఈ సమాచారాన్ని పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి శ్రీ కీర్తి వర్ధన్ సింగ్ రాజ్యసభలో గురువారం(08.08.2024) లిఖితపూర్వకంగా తెలియజేశారు.

# బీఆర్ఎస్‌కు చేజారిన మరో కార్పొరేషన్

హైదరాబాద్, ఆగష్టు 9: బీఆర్ఎస్ కు మరో కార్పొరేషన్ చేజారింది. పీర్జాదిగూడ కార్పొరేషన్ లో 26మంది కార్పొరేటర్లు ఉండగా.. ఇటీవల డిప్యూటీ మేయర్ తో సహా 20మంది కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాజాగా కార్పొరేటర్లు మేయర్ కు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కీసర ఆర్డీఓ ఉపేందర్ రెడ్డి సమక్షంలో 21మంది కార్పొరేటర్లు మేయర్ కు వ్యతిరేకంగా అవిశ్వాసాన్ని ఆమోదించుకోవడం జరిగింది. ఈ అవిశ్వాస ఆమోదంతో జక్క వెంకట్ రెడ్డి ఈరోజు నుంచి మాజీ మేయర్ గా కొనసాగనున్నారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి ఆదర్శంగా నిలవాలి - ఎమ్మెల్యే గండ్ర

వరంగల్, ఆగష్టు 8: ప్రతి ఇంటిలో కచ్చితంగా మొక్కలు నాటి చిన్నపిల్లల మాదిరి చెట్లను కాపాడితే అవి తిరిగి మనల్ని కాపాడతాయని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. శుక్రవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 18, 19 వార్డుల ప్రధాన కూడలిలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ? వానాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనం పెంచి ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

### స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం నిరంతరం జరగాలి.. కలెక్టర్

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిరంతరం జరగాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని అధికారులు, ప్రజల సహకారంతో జిల్లాలో విజయవంతంగా అమలు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ఐదు రోజులే కాకుండా నిరంతరం జరగాలని సూచించారు. ప్రజలు ఇండ్ల పరిసరాలు, గ్రామాలు, మున్సిపాలిటీలో ప్రతి ఇంటిలో మొక్కలు నాటి సంరక్షిస్తే పచ్చదనం ఏర్పడి మంచి వాతావరణం నెలకొంటుందని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# స్టీల్ పరిశ్రమను సందర్శించిన మంత్రి టీజీ భరత్..

కర్నూల, ఆగష్టు 9:ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్, జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీని శుక్రవారం రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ సందర్శించారు. ఆయన వెంట పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీ ఎండి కొయాంక, కర్నూల్ ఆర్డీవో శేషిరెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోమశేఖర్ రెడ్డి, ఓర్వకల్లు తహసిల్దార్ వెంకటరమణలతో అనంతరం మంత్రి సమీక్ష నిర్వహించారు. పరిశ్రమకు కావాల్సిన మౌలిక వసతులపై చర్చించారు.

# న్యాయవాదుల సమస్యలపై అసెంబ్లీలో నిలదీస్తాం : పల్లా రాజేశ్వర్ రెడ్డి

జనగామ, ఆగష్టు 9: న్యాయవాద దంపతులపైపోలీసులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. న్యాయవాదుల నిరసన దీక్షకు మద్దతు తెలుపుతున్నామని జనగామఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడిఅన్నారు. శుక్రవారం ఆయన జనగామలో న్యాయవాదుల దీక్ష శిబిరానికి వెళ్లి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..లాయర్స్‌పై దాడికి పాల్పడిన పోలీసులను బదిలీ చేయడం కాదు, ఉద్యోగాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు భద్రత కల్పించాల్సిన పోలీసులు లంచాలకు మరిగి ప్రజలను వేధిస్తున్నారని ఆరోపించారు.

ఒక ఎమ్మెల్యేగా ఉన్న తనపైనే నాలుగు అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారంటే సామాన్య ప్రజలను ఇంకెంతగా వేధిస్తున్నారో తెలుస్తుందన్నారు. దొంగలను, దోపిడీదారులను పట్టుకోమని పోలీసులను పెడితే, పోలీసు లే దొంగలుగా మారి ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నారని విమర్శించారు. న్యాయవాదుల సమస్యలపై అసెంబ్లీ సమావేశాలలో ప్రస్తావిస్తానని అడ్వకేట్లకు హామీ ఇచ్చారు. కాగా, జనగామలో న్యాయవాద దంపతులపై పోలీసుల దాడి ఘటనపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. జనగామ ఇన్‌స్పెక్టర్ ఎల్. రఘుపతి రెడ్డి, ఎస్ఐ పీ. తిరుపతిని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ చేశారు.

# సుప్రీంకోర్టు తీర్పుపై టి ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీ

## -సంపూర్ణ మద్దతు తెలిపిన- బీసీవై పార్టీ

న్యూఢిల్లీ ఆగష్టు 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్); సుప్రీంకోర్టు తీర్పుపై టి




ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీకి-బీసీవై పార్టీ సంపూర్ణ మద్దతు తెలిపింది. జంతర్మంతర్ వద్ద టి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు తీర్పుపై మాదిగల విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా టి ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇటుక రాజు మాదిగాను బీసీవై పార్టీ సంగారెడ్డి జిల్లా ఇన్చార్జి న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్, మెదక్ పార్లమెంట్ కాంటెస్టెడ్ ఎంపీ సాయ గౌడ్ మరియు ఉమ్మడి మెదక్ జిల్లా టి ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కోలుపుల రత్నయ్య మాదిగ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీసీవై పార్టీ సంగారెడ్డి జిల్లా ఇన్చార్జి న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్ సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి టి ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీకి సంపూర్ణ మద్దతు తెలుపుతూ టి ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ఇటుక రాజు మాదిగకు కృతజ్ఞతలు తెలియజేస్తూ మందకృష్ణ మాదిగతో పాటు 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం చేసిన టి ఎమ్మార్పీఎస్ నాయకులకు ప్రత్యేకంగా పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఇట్టి తరుణంలో మందకృష్ణ మాదిగ నాయకత్వాన మాదిగల పక్షాన అలుపెరగని పోరాటం చేస్తున్న ఉమ్మడి మెదక్ జిల్లా టి ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కోలుపుల రత్నయ్య మాట్లాడుతూ గౌరవనీయులైన మాదిగల పక్షాన మందకృష్ణ మాదిగ చేసిన 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటాన్ని అర్థం చేసుకున్న భారత ప్రధాని నరేంద్ర మోడీ గారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా టి ఎమ్మార్పీఎస్ ఉద్యమ పోరాటాలకు ఎప్పుడు ముందుంటానని మాదిగల అభివృద్ధికి తోడ్పడుతానని సభా ముఖంగా తెలియజేశారు. ఈ యొక్క విజయోత్సవ ర్యాలీలో టి ఎమ్మార్పీఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏసిబి వలలో కార్పొరేషన్ అవినీతి జలగ..

## -ఇన్చార్జ్ రెవెన్యూ అధికారి నరేందర్ ఇంట్లో ఏసీబీ సోదాలు..
## -గతంలో వృద్ధురాలి పెన్షన్ డబ్బులు కాజేయడం పై సస్పెన్ కు గురైన వైనం..
## -గత సంవత్సరం బోధన్ కు బదిలీ అయిన రాజకీయ అండదండలతో బదిలీ కానీ ఘనుడు?




నిజామాబాద్, ఆగష్టు 9: ప్రజా సేవే పరమావధిగా పని చేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు లంచగొండులుగా మారుతున్నారు. ప్రభుత్వం నుంచి నెల నెల వేతనాలు తీసుకుంటూనే సులువుగా డబ్బు సంపాదించేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. నిజాంబాద్ నగరంలోని బసవ గార్డెన్ వద్ద గల అశోక టవర్స్ లో నివాసముంటున్న నిజామాబాద్ మున్సి పల్ కార్పొరేషన్ లో సూపరింటెండెంట్, ఇన్చార్జి రెవెన్యూ అధికారి నరేందర్ ఇంట్లో శుక్రవారం తెల్లవారుజామున నుంచి ఏసీబీ అధికారులు సోదాలు చేస్తున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయని ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు సోదా చేస్తున్నట్లు సమాచారం.

### బిల్ కలెక్టర్ గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమై

1996 సంవత్సరంలో కారుణ్య నియామకాల్లో భాగంగా బిల్ కలెక్టర్ గా కార్పొరేషన్ లో ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి ఆర్ఐగా, సూపరింటెండెంట్ గా, ఇన్చార్జి రెవెన్యూ అధికారులుగా అంచలంచలుగా పదోన్నతలు పొందాడు. అంతేకాకుండా గత సంవత్సరంలో బోధన్ కు బదిలీ అయినా కూడా రాజకీయ అండదండలతో బదిలీ కాలేదని సమాచారం.

### వృద్ధురాలి పింఛన్ కాజేయడంతో సస్పెన్స్ కు గురైన వైనం..

గతంలో అప్పటి కలెక్టర్ యోగితా రాణి ఉన్నప్పుడు రెవెన్యూ బిల్ కలెక్టర్ గా నరేందర్ విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆ సమయంలో ఓ వృద్ధురాలికి సంబంధించి న పెన్షన్ డబ్బులు కాజేసినట్లు నిరూపణ కావడంతో ఇందుకు సంబంధించి సదరు నరేందర్ సస్పెన్స్కు గుర య్యాడు.ప్రస్తుతం నరేందర్ ఇంట్లో ఏసీబీ అధికారుల సోదాలు కొనసా గుతున్నా యి. సోదాల అనంతరం పూర్తి వివరాలను ఏసీబీ అధికారులు వెల్లడించనున్నారు



# సుంకిశాల ఘటన పాపం మీదే- కేటీఆర్




హైదరాబాద్, ఆగష్టు 9: సుంకిశాల ప్రాజెక్టుకు పునరుజ్జీవం తెచ్చిందే బీఆర్ఎస్ ప్రభుత్వమని చెప్పారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. హైదరాబాద్ నీటి అవసరాల కోసం సుంకిశాల ప్రాజెక్టు మొదలుపెట్టారని, అయితే దానిని నల్లగొండ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తుచేశారు. తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీతో కలిసి ఇవాళ కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ నాగార్జునసాగర్‌లో డెడ్‌స్టోరేజీ ఉన్నా హైదరాబాద్‌కు నీటికష్టాలు రాకూడదనే ఈ ప్రాజెక్టు చేపట్టామన్నారు. హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాలకు సాగు, తాగునీటి కోసం సుంకిశాల ఉపయోగపడుతుందని చెప్పారు.

### హైదరాబాద్ కు తాగునీటి కోసం..

కృష్ణానదికి నాలుగేండ్లు నీళ్లు రాకపోయినా ప్రాజెక్టుతో ఇబ్బందులు రావని స్పష్టం చేశారు. ఢిల్లీ, బెంగళూరు, చెన్నైలో నీటికోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, హైదరాబాద్‌లో నీటి కోసం ఇబ్బందులు పడే పరిస్థితి లేదని చెప్పారు. హైదరాబాద్‌కు 50 ఏండ్లు తాగునీటి అవసరాలకు సరిపడేలా తమ హయాంలో ప్రణాళికలు రూపొందించామని తెలిపారు.

రెండున కూలితే.. వెంటనే ఎందుకు చెప్పలేదు..

సుంకిశాల ఘటనను ప్రభుత్వం ఎందుకు తొక్కిపెట్టిందని ప్రశ్నించారు. ఆగస్టు 2న ఉదయం 6 గంటలకు ఘటన జరిగితే ప్రభుత్వానికి సమాచారం లేదా లేక విషయాన్ని కప్పిపెట్టారా అని ప్రశ్నించారు. ఒకవేళ తెలియకపోతే ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. త్వరత్వరగా పనులు చేయాలని హడావుడిగా గేట్లు పెట్టడంతోనే ప్రమాదం జరిగిందన్నారు. ప్రభుత్వ నిర్వహణ లోపంతో గోడ కూలిందన్నారు. పనులు చేస్తున్న ఏజెన్సీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. సుంకిశాల ఘటనపై న్యాయ విచారణ చేయాలన్నారు. సుంకిశాల గోడ కూలిన ఘటలో తమ ప్రభుత్వంపై రేవంత్ సర్కార్ అసత్య ప్రచారం చేస్తున్నదని మండిపడ్డారు.

రేవంత్ దే బాధ్యత..

మున్సిపల్ శాఖను తనవద్దే పెట్టుకున్న సీఎం రేవంత్ ఈ ఘటనకు బాధ్యత వహించాలన్నారు. మేడిగడ్డలో ఏమైనా జరిగితే కేంద్రం స్పందిస్తుందని, ఇప్పుడు బీజేపీ ఏం చెబుతుందని కేటీఆర్ నిలదీశారు. మేడిగడ్డ ఘటనను ఎన్నికలున్నప్పటికీ తాము దాచిపెట్టలేదని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం సాగు, తాగునీటికి ప్రాధాన్యం ఇచ్చిందని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు కూడా వేగంగా చేశామన్నారు. సుంకిశాల ప్రమాదం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమని ఆరోపించారు. పరిపాలన చేతగాక కేసీఆర్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

పేర్లు మార్చడమే మీ ప్రజా పాలనలో మార్పు ..

హైదరాబాద్‌లో శాంతి భద్రతలు సరిగ్గా లేవన్నారు. పేర్లు మార్చడమేనా మార్పు అంటే అని ఎద్దేవా చేశారు. వీళ్లకు సరుకు లేదు.. సబ్జెక్టు లేదని విమర్శించారు. బ్యారేజ్ గేట్లు ఎప్పుడు దించుతారో కూడా తెలియదని చెప్పారు. కాళేశ్వరం ఫెయిలైతే అన్ని రిజర్వాయర్లకు నీళ్లు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. నీళ్ల విషయంలో కేసీఆర్‌కు పేరు వస్తుందనే ఆరోపణల చేస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి చేతగాని తనంతోనే ఈ అంశాన్ని దాచిపెట్టారని ఆరోపించారు. మంచి అయితే వారి ఖాతాలో, చెడు అయితే తమ ఖాతాలో వేస్తున్నారని విమర్శించారు. సుంకిశాలను త్వరలో బీఆర్ఎస్ బృందం సందర్శిస్తుందని చెప్పారు. రిటైర్డ్ ఇంజినీర్లను కూడా తీసుకెళ్తామన్నారు.

# జర్నలిస్ట్ వెంకటరెడ్డి సేవలు మరువలేనివి

- టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి
- ఖమ్మం ప్రెస్ క్లబ్ లో వెంకటరెడ్డి సంతాప సభ
- సీనియర్ జర్నలిస్ట్ వెంకటరెడ్డి మృతికి టీజేఎఫ్ ఘన నివాళి

ఖమ్మం, ఆగష్టు 9: (నేటినిజం ప్రతినిధి): దశాబ్ద కాలంగా జర్నలిస్టుగా పనిచేసిన ఏలేటి వెంకట్ రెడ్డి మృతి చెందడం చాలా బాధాకరమని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా అధ్యక్ష




కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి లు అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్లో శుక్రవారం టియుడబ్ల్యూజే(టీజేఎఫ్) ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన జర్నలిస్ట్ వెంకటరెడ్డి సంతాప సభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా విచ్చేసిన జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవిలు మాట్లాడుతూ...గత పది సంవత్సరాలుగా వెంకటరెడ్డి టీజేఎఫ్ యూనియన్ లో క్రియాశీలకంగా పనిచేసి యూనియన్ బలోపేతానికి ఎంతో కృషి చేశారని అన్నారు. జర్నలిస్ట్ వెంకటరెడ్డి సేవలు మరువలేనివన్నారు. ఇళ్ల స్థలాలు వచ్చే సమయంలో వెంకట్ రెడ్డి మృతి చెందటం బాధాకరమన్నారు. జర్నలిస్టు వెంకటరెడ్డి కుటుంబానికి ప్రభుత్వం నుండి రావాల్సిన ఆర్థికసాయం, ఇతర సాయాలు అందించేందుకు తమవంతుగా కృషి చేస్తామన్నారు. వెంకట్ రెడ్డి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు విజేత, టీఎస్ చక్రవర్తి, మందుల ఉపేందర్, జానీ పాషా, యలమందల జగదీష్, నరేందర్, ఈశ్వరి, భారతి, కొరకొప్పుల రాంబాబు, కరీష అశోక్, ఉత్కంఠం శ్రీనివాస్, జీవన్ రెడ్డి, పానకాలరావు, బండి కుమార్, రమేష్, వెంకటకృష్ణ, రోసిరెడ్డి, నల్లమోతు శ్రీనివాస్, సాయి, హుస్సేన్, వెంకటాద్రి, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, అప్పారావు, యాదగిరి, కుమార్, రవి, వెంకటేష్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహేష్ బాబు జన్మదిన వేడుకలు

ఖమ్మం, ఆగష్టు 9: (నేటినిజం ప్రతినిధి): సూపర్ స్టార్ కృష్ణ మహేష్ సేన జిల్లా అధ్యక్షుడు దేవ భక్తుని కిషోర్ బాబు ఆధ్వర్యంలో మహేష్ బాబు జన్మదిన వేడుకలు జిల్లా వ్యాప్తంగా, మండల కేంద్రాల్లో గ్రామాల్లో పెద్ద ఎత్తున నిర్వహించడం జరిగింది. ఖమ్మం నగరంలో సూపర్ స్టార్ కృష్ణ ఖమ్మం జిల్లా, నగర కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సామాజిక సేవా కార్యక్రమా లు నిర్వహించడం జరిగింది. ముందు గా వలు దేవాలయాల్లో మహేష్ బాబు పేరు మీద పూజలు చేసి బాబు నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని ఆ దేవుళ్లను వేడుకోవడం జరిగింది. ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి రక్తదాన కేంద్రంలో సుమారు 200మంది యువకులు రక్తదానం చేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ అడిషనల్ డీసీపీ గణేష్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ విచ్చేసి అభిమాను లు ఏర్పాటు చేసిన కేకును కట్ చేసి మహేష్ బాబుకి జన్మదిన శుభాకాంక్ష లు తెలియజేశారు. అనంతరం దాసరి ఫౌండేషన్ అనాధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి ఆశ్రమంలో ఉన్న వృద్ధులు సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరిపారు. అనంతరం జిల్లా గౌరవ అధ్యక్షులు తోట రంగారావు-దమ యంతి మహిళలకు ఏర్పాటుచేసిన చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మహిళలకు చీరలు పంచడం జరిగింది, ఆడపడుచుల సమక్షంలో మహేష్ బాబు జన్మదిన కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దేవభక్తుని కిషోర్ బాబు మాట్లాడుతూ...ప్రతి సంవత్సరం ఆగస్టు 9వ తారీకు మాకు పండుగ రోజు ఈరోజు కోసం మేమంతా ఎదురు చూస్తామని జిల్లా వ్యాప్తంగా అభిమానులు అందరు కూడా మహేష్ బాబు పుట్టినరోజుని పండుగ లాగా జరుపుకుంటూ ప్రజలకు ఉపయోగ పడే సామాజిక సేవ కార్యక్రమాలు ఎన్నో చేయడం జరుగుతుందని దీనికి ప్రధానంగా మా ఘట్టమనేని కుటుంబమే కారణమని అన్నారు. మహేష్ బాబు ఇప్పటివరకు సుమారు 3500మంది పిల్లలకు ఉచితంగా గుండె ఆపరేషన్ చేయించినారు, కానీ ఎక్కడ వారి దానగుణం చెప్పుకోవడం జరగలేదు. వారు చేసే దాన ధర్మాల్లో మేము చేసేది చాలా చిన్నదే అయినప్పటికీ వారి బాటలో ప్రయాణిస్తూ ప్రతి సంవత్సరం ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు ప్రజలకు ఉపయోగ పడే అనేక రకాల కార్యక్రమాలు జరుపుకుంటూ పోతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బాణాల లక్ష్మణ్, నగర అధ్యక్షులు మునగాల బాలు, జిల్లా ఉపాధ్యక్షులు చింతమల్ల గురుమూర్తి, నగర కన్వీనర్ నాగార్జునపు బ్రహ్మం, సుధాకర్, సత్తుపల్లి అధ్యక్షులు కే. వెంకటేశ్వర్లు, ఎన్.వెంకన్న, వివి. కృష్ణ, పులిపాటి సంపత్, ఇరుగు నవీన్, మద్రి శివ, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ,ఎస్టీ వర్గీకరణపై సుప్రీం తీర్పు.. ఆందోళన వ్యక్తం చేసిన 100 మంది బీజేపీ ఎంపీలు



న్యూఢిల్లీ, ఆగష్టు 9: ఎస్సీ, ఎస్టీల ఉపవర్గీకరణతో పాటు క్రిమీలేయర్ అంశంపై ఇటీవల సుప్రీంకోర్టు కీలక తీర్పును ఇచ్చింది. అయితే ఆ తీర్పుపై వంద మంది బీజేపీ ఎంపీలు(ఃఏఖ ఓఖబ) ఆందోళన వ్యక్తం చేశారు. ఉభయసభలకు చెందిన ఆ ఎంపీలు.. ప్రొఫెసర్ సికందర్ కుమార్ నేతృత్వంలో .. ప్రధాని మోదీని ఇవాళ కలిశారు. అందరు ఎంపీల ఫిర్యాదులను ప్రధాని మోదీ ఆలకించారని, ఎంపీలకు అనుకూలంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారని ఎంపీ సికందర్ కుమార్ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీల్లో వర్గీకరణ చేపట్టాలని వేసిన పిటీషన్లపై తీర్పును ఇస్తూ.. ఏడుగురు సభ్యుల సుప్రీం ధర్మాసనం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. క్రిమీలేయర్ అంశంపై సుప్రీం కోర్టు చేసిన సూచనల గురించి దరఖాస్తు ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు. క్రిమీలేయర్ నిర్ణయాలను అమలు చేయరాదు అని వంద మంది ఎంపీలు ప్రధాని మోదీని కోరినట్లు తెలుస్తోంది.

# కాంగ్రెస్‌తోనే పేదలకు లబ్ధి.. ఎమ్మెల్యే వివేక్..



ఆదిలాబాద:, ఆగష్టు 9: తెలంగాణ పేద ప్రజలకు కాగ్రెస్ ప్రభుత్వంతోనే లబ్ధి చేకూరుతుందని మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు

. స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఇవాళ అర్హులైన 20మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి , కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెన్న సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తెస్తే కఠిన చర్యలు.. ఎస్పీ సుబ్బరాయుడు




తిరుపతి, ఆగష్టు 9: ఇతర రాష్ట్రాల నుంచి మద్యం సరఫరా చేయడం కానీ, అమ్మడం కానీ ఏపీ ఎక్సైజ్ చట్టం ప్రకారం నేరమని, అటువంటి చర్యలకు పాల్పడితే చట్టరీత్యా శిక్షకు గురవుతారని తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికలు ? 2024 సమయంలో అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన మద్యం బాటిళ్లను, అనుమతి లేకుండా బెల్టు షాపుల ద్వారా అమ్ముతుండగా పట్టుబడిన మద్యం బాటిళ్లను, నాటుసారాను జిల్లా పోలీసు, స్పెషల్ ఎన్ ఫోర్స్ మెంట్ బ్యూరో అధికారులు స్థానిక బాలాజీ కాలనీ పోలీస్ క్వార్టర్స్ ప్రాంగణంలో శుక్రవారం ధ్వంసం చేశారు. దాదాపు 27,568 వివిధ రకాల పరిమాణంలో ఉన్న మద్యం బాటిళ్లను (క్వార్టర్, హాఫ్, ఫుల్) రోడ్ రోలర్ సహాయంతో తొక్కించారు.

ఈసందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు మాట్లాడుతూ? గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇతర రాష్ట్రాల నుంచి తిరుపతి జిల్లా మీదుగా అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను పలు సందర్భాల్లో పట్టుకోవడం జరిగిందని, అదేవిధంగా అనుమతి లేకుండా బెల్టుషాపులు నిర్వహిస్తూ అమ్ముతున్న వారిపై 300 కేసులు రిజిస్టర్ చేసి, సీజ్ చేసిన మద్యం బాటిళ్లను కూడా దాదాపు 27,568 అన్ని క్వాంటిటీల (5,017.12 లీటర్లు) బాటిళ్లను రోడ్డు రోలర్ సాయంతో ధ్వంసం చేయడం జరిగిందని, వీటి విలువ దాదాపు 36 లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు.

అధిక సంపాదనకు ఆశపడి అనుమతి లేకుండా ఇతర రాష్ట్రాల నుంచి మద్యం బాటిళ్లను సరఫరా చేసి వాటిని అమ్మడం చట్టరీత్యా నేరమని, అటువంటి చర్యలకు పాల్పడితే శిక్షార్హులు కాక తప్పదని హెచ్చరించారు. అదేవిధంగా అనుమతి లేకుండా బెల్టుషాపులు నిర్వహిస్తూ మద్యం అమ్మకాలు చేయరాదని, అతిక్రమిస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల కాలంలో అక్రమ ధనార్జన కోసం చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ చాలామంది ముఖ్యంగా యువకులు తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, ఇటువంటి వాటికి దూరంగా ఉంటూ గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని ఆయన సూచించారు. పదేపదే చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే పీడీ యాక్టులు కూడా నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ సందర్భంగా పోలీసు సిబ్బందిని, స్పెషల్ ఎన్ ఫోర్స్ మెంట్ బ్యూరో అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు అభినందిస్తూ, దాడులను మరింతగా ముమ్మరం చేసి పూర్తిస్థాయిలో ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తిరుపతి జిల్లా మీదుగా రాష్ట్రం లోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు.

తిరుపతి జిల్లాకు అంతర్ రాష్ట్రాలు అయిన తమిళనాడు, కర్ణాటక సరిహద్దు ఉండడంతో అక్రమంగా రవాణా చేసి డబ్బులు సంపాదించుకోవాలి అనుకునే వారు తిరుపతి జిల్లా మీదుగా సరఫరా చేస్తూ రాష్ట్రంలో అక్రమ మద్యం అమ్మకాలు కొనసాగిస్తున్నారని, కావున తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి తిరుపతి జిల్లాలోకి వచ్చే దారులు అన్నింటిలోనూ ఎంట్రీ పాయింట్ల వద్ద నిఘాను ముమ్మరం చేస్తూ, దాడులు నిర్వహించి పూర్తిస్థాయిలో ఈ స్మగ్లింగ్ ను అరికట్టడానికి మరింతగా కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు పరిపాలన, కులశేఖర్ శాంతిభద్రతలు, రాజేంద్ర సెబ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, తిరుపతి సీఐలు, ఎస్సైలు అండ్ పోలీస్, సెబ్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్

## 34 మంది విద్యార్థులకు అస్వస్థత

హైదరాబాద్, ఆగష్టు 9: విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన ఘటన గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం లింగోటం ఆక్స్‌ఫర్డ్ ప్రైవేట్ పాఠశాల హాస్టల్‌లో జరిగింది. విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి పాఠశాలను తనిఖీ చేయాలని డీడీఎంహెచ్‌వో తారాసింగ్‌ను ఆదేశించారు. ఆయన హాస్టల్ భోజనాన్ని పరిశీలించారు. చికిత్స పొందుతున్న విద్యార్థులను జిల్లా వైద్యాధికారి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో 820 మందికి 525 మంది అల్పాహారం తీసుకున్నారని, వారిలో 34 మంది అస్వస్థతకు గురికాగా.. అచ్చంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించామని తెలిపారు.

# రెండోసారి.. ఉస్మానియా మెడికల్ కళాశాలకు ఐఎస్‌వో గుర్తింపు

హైదరాబాద్, ఆగష్టు 9: ఉస్మానియా మెడికల్ కళాశాలకు ఐఎస్‌వో 9001-2015 గుర్తింపు దక్కింది. ఈ మేరకు కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఐఎస్‌వో గుర్తింపు సంస్థ ప్రతినిధి శివయ్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్రకుమార్‌కు గురువారం గుర్తింపు పత్రాన్ని అందజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, తెలంగాణలో రెండోసారి ఉస్మానియా మెడికల్ కళాశాల ఐఎస్‌వో గుర్తింపును పొందడం అభినందనీయమన్నారు.

కళాశాలలో అందిస్తున్న నాణ్యమైన విద్యా ప్రమాణాలు, భద్రతా సామర్థ్యంతో పాటు గ్రీన్ ఎన్విరాన్‌మెంట్‌లో మంచి బోధనను అందిస్తున్నామన్నారు. కళాశాలలోని అన్ని స్థాయి ఉద్యోగుల కృషి వల్లే కళాశాలకు రెండోసారి ఐఎస్‌వో గుర్తింపు లభించిందని చెప్పారు.

# మా ఇంట్ల చెత్తనే తీసుకుపోతలేరు.. మేమూ ఇబ్బందులు పడుతున్నం: జీహెచ్ఎంసీ కమిషనర్

- ఇంటికి చెత్త బండి కూడా రావటం లేదు
- రోజువారీ చెత్త సేకరణ సరిగా లేదు
- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి



హైదరాబాద్, ఆగష్టు 9: 'గ్రేటర్ హైదరాబాద్‌లో ఇంటింటి చెత్త సేకరణ సరిగా లేదు. రోజూవారీగా చెత్తను సేకరించటం లేదు. మా ఇంటికి సైతం చెత్తబండి రావటం లేదు. మేము కూడా ఇబ్బందులు పడుతున్నాం' అంటూ గురువారం స్వయానా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆమ్రపాలి పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో పారిశుద్ధ్య నిర్వహణ ఎంత అధ్వానంగా ఉన్నదో చెప్పడానికి ఈ వ్యాఖ్యలే నిదర్శనం. ముఖ్యమంత్రి సహా మంత్రులు, ఐఏఎస్‌లు, ప్రముఖులు ఉండే రాజధాని దుస్థితి ఇది. ఇక పల్లెల దుస్థితిని మాటల్లో వర్ణించలేం. బీఆర్ఎస్ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లెప్రగతి, పట్టణ ప్రగతిని అటకెక్కించిన కాంగ్రెస్ సర్కారు చర్యల ఫలితంగా ఇప్పుడు ఎక్కడ చూసినా చెత్తాచెదారమే కనిపిస్తున్నది. పారిశుద్ధ్య కార్మికులకు కొన్ని నెలలుగా వేతనాలు ఇవ్వకపోవటం తో వాళ్లు విధులు నిర్వర్తించటం లేదు. ఈ సమస్యపై మాజీ మంత్రి హరీశ్‌రావు గొంతెత్తడం తో.. గురువారమే కార్మికులకు వేతనాలు విడుదల చేస్తున్నట్టు మంత్రి సీతక్క ప్రకటించారు. కానీ ఇప్పటికే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యాతోపాటు అంటువ్యాధులు తీవ్రంగా ప్రబలాయి. ఇటీవల రాష్ట్రంలో ఇద్దరు నిండు గర్భిణులు డెంగ్యూ సోకి కన్నుమూశారు. వర్షాలు భారీగా కురుస్తుండటంతో పారిశుద్ధ్య నిర్వహణ నానాటికీ అధ్వానంగా మారింది.


స్వచ్ఛ ఆటోలపై చర్యలేవి..

పారిశుద్ధ్య నిర్వహణలో జీహెచ్ఎంసీ వైఫల్యాలను ఎత్తిచూపుతూ 'నమస్తే తెలంగాణ' పలుమార్లు ప్రత్యేక కథనాలను ప్రచురించింది. అయినా అధికారుల్లో చలనం లేదు. రాజధానిలో సుమారు 5,250 స్వచ్ఛ ఆటోల ద్వారా నగరంలో 4,886 కాలనీల్లో 23 లక్షల గృహాల నుంచి రోజుకు 7 వేల మెట్రిక్ టన్నులకు పైగా చెత్త సేకరణ జరగాలి. ఒక్కో ఆటోకు 500-600 ఇండ్లు కేటాయించి, చెత్త సేకరణ చేపట్టాలి. కొన్ని రోజులుగా స్వచ్ఛ ఆటోల పనితీరు సరిగా లేదు. రోజుకు దాదాపు 1,000 స్వచ్ఛ ఆటోలు పనిచేయటం లేదని స్వయంగా గత కమిషనర్ రోనాల్డ్‌రోస్ గుర్తించారు. ఇటీవల కమిషనర్ ఆమ్రపాలి సైతం స్వచ్ఛ ఆటోల పనితీరుపై సమీక్షించి స్వచ్ఛ ఆటోలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించినా ఫలితం లేదు.

# 15న ఓలా ఎలక్ట్రిక్ బైక్ ఆవిష్కరణ.. ఆరు నెలల్లో సేల్స్ ప్రారంభం..!

హైదరాబాద్, ఆగష్టు 9: ప్రముఖ ఎలక్ట్రిక్ టూ వీలర్స్ తయారీ సంస్థ 'ఓలా ఎలక్ట్రిక్' తన తొలి ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్‌ను ఈ నెల 15న ఆవిష్కరించనున్నది. స్వాతంత్ర్య దినోత్సవం నాడు నిర్వహించే 'సంకల్ప్ 2024' వేడుకలో ఓలా ఎలక్ట్రిక్ సీఈఓ కం ఫౌండర్ భవిష్ అగర్వాల్ ఆవిష్కరిస్తుందని సమాచారం. ఇప్పటికే మార్కెట్లో విడుదలైన ఓలా ఎస్1ఎక్స్, ఎస్1 ఎయిర్, ఎస్1 ప్రో స్కూటర్ల సరసన ఈ ఎలక్ట్రిక్ మోటారు సైకిల్ చేరనున్నది. ఈ నెల 15న ఓలా ఎలక్ట్రిక్ తన ఎలక్ట్రిక్ మోటారు సైకిల్‌ను ఆవిష్కరిస్తామని ధృవీకరించింది. వచ్చే ఆరు నెలల్లో సదరు ఎలక్ట్రిక్ మోటారు సైకిల్స్ విక్రయం ప్రారంభం అవుతాయని తెలుస్తోంది.

టోర్క్ క్రటోస్ ఆర్, రివోల్ట్ ఆర్వీ 400, అల్ట్రావయోలెట్ ఎఫ్77 2, మాస్టర్ ఏరియా వంటి ఈవీ మోటారు సైకిళ్లతో పోటీ పడనున్నది. ఫ్రంట్ ఫేసియాలో డ్యుయల్ పాడ్ ఎల్ఈడీ హెడ్ ల్యాంప్, టాప్ పై హరిజొంటల్ ఎల్ఈడీ స్ట్రిప్, పక్కన రెండు వెర్టికల్ స్ట్రిప్స్ తదితర ఫీచర్లు ఉంటాయి. సంప్రదాయ సైడ్ అప్ టెలిస్కోపిక్ ఫోర్క్ సస్పెన్షన్, ట్యూబులర్ ఫ్రేమ్‌తో కూడిన లార్జ్ బ్యాటరీ, చైన్ ఫైనల్ డ్రైవ్ వంటి ఫీచర్లు కూడా వాడతారు. తమిళనాడులోని ఓలా ఫ్యూచర్ ఫ్యాక్టరీలో ఈ నెల 15న స్వాంతత్ర్య దినోత్సవ వేడుకలు జరుగుతాయి.



# మెడికల్ షాపుని ప్రారంభించిన పరికపల్లి



ఖమ్మం, ఆగష్టు 9: (నేటినిజం ప్రతినిధి): కొనిజర్ల మండలం పెద్దమునగాల గ్రామం అంబేద్కర్ సెంటర్ లో నూతనంగా ప్రారంభించిన లక్ష్మి సాయి మెడికల్ షాపును జిల్లా కాంగ్రెస్ నాయకులు పరికపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రొపెటర్ మోహన్ చారి నా తమ్ముడు లాంటి వాడని మంచి గ్రామీణ వైద్యుడని తను నిత్యం ప్రజలకి అందుబాటులో ఉంటాడని డబ్బుల కోసమే కాకుండా ప్రజలకి సేవ చేసే గుణం ఉందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సోల శ్రీను, అంజయ్య, నాగయ్య, తడికమల్ల నవీన్, శ్రీను, వెంకన్న, అర్జున్, కిరణ్, వెంకట కృష్ణ, అప్పల చారీ, అర్జున్, తాబేలు, తదితరులు పాల్గొన్నారు.

# దొంగల బీభత్సం.. భారీగా బంగారం, వెండి అపహరణ

వరంగల్, ఆగష్టు 8: జయశంకర్ జిల్లా భూపాలపల్లి మండలం, బీసీ కాలనీ వెంగల్ రావు వెంచర్ లో బొమ్మకంటి పవన్ కుమార్ ఇంట్లో దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించి 12 తులాల బంగారం, 16 తులాల వెండి, నగదు రూ. 40వేలు అపహారించుకుపోయినట్లు ఇంటి యజమాని బొమ్మకంటి పవన్ కుమార్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం పని నిమిత్తం భూపాలపల్లికి వెళ్లి సాయంత్రం 4గంటలకు తిరిగి రాగా.. ఇంటి తాళం లేదని, ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు తీసి వస్తువులు చిందర వందరగా పడి వున్నాయని తెలిపాడు.

బీరువాలోని 12 తులాల బంగారంతో పాటు 16 తులాల వెండి, నగదు రూ.40వేలు గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారని బాధితుడు పవన్ తెలిపారు. 100కు ఫిర్యాదు చేయడంతో క్లూస్ టీం, భూపాలపల్లి పోలీసులు వివరాలు సేకరించారు. బాధితుడు శుక్రవారం భూపాలపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# మీ ఆర్థిక అవసరాలకు బంగారమే భరోసా!




హైదరాబాద్, ఆగష్టు 9: వాల్యూ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్, క్యాప్స్ గోల్డ్ వారి అనుబంధ సంస్థ, 1901లో స్థాపించబడింది. క్యాప్స్ గోల్డ్ గత 70 ఏళ్లుగా బులియన్ వ్యాపారం, రిటైల్ జ్యువెల్లరీ, జ్యువెల్లరీ తయారీ మరియు గోల్డ్ రిఫైనరీ రంగాల్లో సేవలు అందిస్తున్నారు. వాల్యూ గోల్డ్ సంస్థని సెప్టెంబర్ 2023 హైదరాబాద్‌లో ప్రారంభించారు. ఎవరైతే వారి ఆర్థిక అవసరాలకు బంగారాన్ని అమ్మి డబ్బు కావాలనుకుంటారో వారి దగ్గర బంగారం కొనే వెసులుబాటుని కల్పిస్తున్నారు.

గోల్డ్‌లోన్‌లో ఉన్న బంగారాన్ని కూడా విడిపించి, ఆ రోజు మార్కెట్ రేటుకే కొని గరిష్ట విలువ చేకూరేలా ఆర్థిక భద్రతను కల్పిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో బంజారాహిల్స్, సికింద్రాబాద్, ఉప్పల్, కూకట్‌పల్లి మరియు చింతల్‌లో వారి సేవలను అందిస్తున్నారు. వాల్యూ గోల్డ్, తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా బంగారం కొనుగోలు చేసే వాహనాన్ని వినియోగాదారులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. దీని ముఖ్య ఉద్దేశం గ్రామీణ ప్రాంతాల వారికి బంగారం కొనుగోలు సేవలను అత్యాధిక పారదర్శకత మరియు విలువలతో అందించడం.

త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌లోనూ బంగారం కొనుగోలు చేసే వాహనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొట్టమొదటి సారిగా, బంగారం కొనుగోలు రంగంలో ఆటోమేటిక్ ప్రక్రియను ప్రవేశపెట్టారు. వ్యక్తుల ప్రమేయమే లేకుండా బరువు మరియు స్వచ్ఛతను, ఘనించి బంగారాన్ని కరిగించి వినియోగదారులకు అత్యధిక మొత్తం చేకూరేలా సేవలను అందిస్తున్నారు. బంగారం మరియు వెండి నాణేలను వారి బ్రాంచీలలో కొనుగోలు చేయవచ్చు. ఎన్ఏబీఎల్ సర్టిఫైడ్ అయిన క్యాప్స్ గోల్డ్ రిఫైనరీ ఈ నాణేలు తయారు చేస్తున్నారు.

వినియోగదారులు, వారి బంగారం యొక్క స్వచ్ఛతని తెలుసుకోవడానికి ఫ్రీ ప్యూరిటీ టెస్ట్ సేవలను వారి బ్రాంచీల్లో ఉపయోగించుకోవచ్చు. మన ఆర్థిక అవసరాలకు బంగారాన్ని అమ్ముకోవడం కూడా అత్యంత తెలివైన అడుగు, బంగారాన్ని అమ్మి డబ్బుని ఇంటికి తీసుకొని రావటం కూడా శ్రావణమే.

# ప్రజల భవిష్యత్తు తీర్చిదిద్దేది చదువని, ప్రతిఒక్కరు చదువుకోవాలి:జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్




ఖమ్మం, ఆగష్టు 9: (నేటినిజం ప్రతినిధి): ప్రజల భవిష్యత్తు తీర్చిదిద్దేది చదువని, ప్రతిఒక్కరు చదువుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పెవిలియన్ నుండి జెడ్పి సెంటర్ వరకు చేపట్టిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...సమాజంలో ఉన్నత స్థితికి ఎదగాలంటే చదువు ఒకటే మూలమని అన్నారు. చదువు ద్వారా ఎంతటి స్థాయినైన చేరుకోవ చ్చని కలెక్టర్ తెలిపారు. ఆదివాసీ సాంప్రదాయాల ద్వారా నేర్చుకోవాలి ్సింది చాలా ఉందన్నారు. ఆర్థికంగా కాకుండా, ఆరోగ్యపరంగా, ప్రకృతిలో మమేకమై, ఒక చక్కటి సంతోషకరమైన జీవనం గడపడం ఆదివాసీల నుండి నేర్చుకోవాలన్నారు. ఆదివాసీలు మార ుమూల ప్రాంతాల్లో వెనుకబడి ఉన్నారని, విద్యాపరంగా, ఆరోగ్యపం ంగా, మౌళిక వసతుల పరంగా సమస్యలు ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం నుండి జిల్లా యంత్రా ంగం నుండి పూర్తి మనసుతో సేవలు అందిస్తామని ఆయన తెలిపారు. అనంతరం జిల్లా గిరిజన అభివృద్ధి అధికారిణి విజయలక్ష్మి స్థానిక గిరిజన భవనంలో ఆదివాసీల జెండా ఆవిష్కరణ చేసి కొమురం భీం, ఆదివాసీ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గిరిజన భవన్ లో ఏర్పా టు చేసిన సమావేశంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతుల ను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఏవో నారాయణ రెడ్డి, ఏటిడివోలు, ఏసీఎంఓలు, ఆదివాసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇండో-బాంగ్లాదేశ్ బార్డర్ (ఐబిబి)లో ప్రస్తుత స్థితిని పర్యవేక్షించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేసిన భారత ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఆగష్టు 9: ఇండో-బాంగ్లాదేశ్ బార్డర్ (ఐబిబి)లో ప్రస్తుతం నెలకొన్న స్థితిని పర్యవేక్షించడానికి ఒక కమిటీని భారత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ బాంగ్లాదేశ్ లో భారతీయ మూలాలున్న పౌరులతో పాటు అల్పసంఖ్యాక సముదాయాలకు చెందిన ప్రజల సురక్షకు కూడా తగిన జాగ్రతచర్యలను తీసుకొనేటట్టుగా చూసేందుకు బాంగ్లాదేశ్ లోని సంబంధిత అధికారులతో తరచుగా సంప్రదింపులను జరుపుతుంది.

సరిహద్దు భద్రత దళం (బిఎస్ఎఫ్) ఈస్టర్న్ కమాండ్ ఎడిజి ఈ కమిటీకి అధ్యక్షత వహిస్తారు; బిఎస్ఎఫ్ ఫ్రంటియర్ హెడ్ క్వార్టర్స్ సౌథ్ బెంగాల్ ఐజి, బిఎస్ఎఫ్ ఫ్రంటియర్ హెడ్ క్వార్టర్స్ త్రిపుర ఐజి, లాండ్ పోర్ట్స్ ఆథారిటి ఆఫ్ ఇండియా (ఎల్‌పిఎఐ)లోని మెంబర్ (ప్రణాళిక రూపకల్పన-అభివృద్ధి) లతో పాటు ఎల్‌పిఎఐ కార్యదర్శి ఈ కమిటీలో ఇతర సభ్యులుగా ఉంటారు.

# కాంగ్రెస్ పునాదులను బీజేపీ, జేడీఎస్ పెకిలించలేవు : డీకే శివకుమార్

న్యూఢిల్లీ, ఆగష్టు 9: కర్నాటకలో సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బీజేపీ, జేడీఎస్ కుట్ర పన్నుతున్నాయని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఆరోపించారు. మైసూర్‌లో శుక్రవారం జరిగిన జన్ ఆందోళన యాత్రను ఉద్దేశించి డీకే శివకుమార్ మాట్లాడారు. తాము సిద్ధరామయ్య వెన్నంటి ఉంటామని, కర్నాటకలో మరోసారి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఐక్యంగా పనిచేస్తామని చెప్పారు.

ప్రజ్వల్ రేవణ్ణ కేసులో కేంద్ర మంత్రి, జేడీయూ నేత హెచ్‌డీ కుమారస్వామి ఏం అన్నారనే వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. జేడీఎస్ పార్టీ అగ్రనాయకత్వం వారి ఎమ్మెల్యేలను ఎదిగేందుకు అనుమతించదని అన్నారు. వారంతా జేడీఎస్ అగ్రనాయకత్వం కనుసన్నల్లో పనిచేయాల్సిందేనని చెప్పారు. కాంగ్రెస్ పునాదులను బీజేపీ, జేడీఎస్‌లు పెకిలించలేవని స్పష్టం చేశారు. అన్యాయం తలపెట్టిన వారు, పేదల వ్యతిరేకులపైనే తమ పోరాటమని డీకే శివకుమార్ పేర్కొన్నారు.

కాగా, కాంగ్రెస్ జన్ ఆందోళన యాత్రలో భాగంగా మైసూర్ వేదికగా కర్నాటక సీఎం సిద్ధరామయ్య శుక్రవారం బీజేపీ, జేడీఎస్ నేతలపై విమర్శలు గుప్పించారు. రాజ్‌భవన్ కేంద్రంగా వారు (బీజేపీ-జేడీఎస్) తనకు వ్యతిరేకంగా కుట్ర పన్నారని ఆరోపించారు. తనకు భూమి కేటాయించాలని తాను తన పలుకుబడిని ఉపయోగించానని బీజేపీ, జేడీఎస్ నేతలు ఆరోపిస్తున్నారని అన్నారు.

# పింఛన్ డబ్బుల కోసం తల్లిని చంపిన తనయుడు

హైదరాబాద్, ఆగష్టు 9: పింఛన్ డబ్బుల కోసం కన్నతల్లినే కొడుకు కడతేర్చిన సంఘటన మెదక్ జిల్లా నిజాంపేటమండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిజాంపేటకు చెందిన రామచంద్రం గత కొన్ని ఏండ్లుగా మద్యానికి బానిపై డబ్బుల కోసం ఇంట్లో తరుచూ గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి పింఛన్ డబ్బులు ఇవ్వాలని తల్లి దుర్గవ్వ(70)తో రామచంద్రం గొడువపడ్డాడు. మద్యం మత్తులో చున్నీతో తల్లీ మెడకు ఉరివేసి హత్య చేశాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి రామాయంపేట సీఐ వేంకటరాజగౌడ్, ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి చేరుకొని నిందితుడుని అదుపులోకి తీసుకున్నారు. మృతురాలు కూతురు విజయ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

# శ్రీ ఆంజనేయ ఫెర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్స్ షాపును ప్రారంభించిన కోసూరి శ్రీనివాసరావు, ఏవో బాలాజీ



ఖమ్మం, ఆగష్టు 9: (నేటినిజం ప్రతినిధి): కొణిజర్ల మండలం ఉప్పలచెలక గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఉప్పలచెలక గ్రామ మాజీ సర్పంచ్ భాదవత్ సైదులు నూతనంగా నిర్మించిన శ్రీ ఆంజనేయ ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ పురుగు మందు షాపును ప్రారంభించిన వైరా నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, కొనిజర్ల మండల అగ్రికల్చర్ ఆఫీసర్ బాలాజీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రాయల పుల్లయ్య, కొనకంచి మోసే, గుడివాడ వెంకటేశ్వర్లు, కోసూరి సైదారావు, తుళ్లూరి శరత్, భరత్, కనగంటి గణేష్, గుగులోతు నాగేశ్వరావు, వసంత్, తదితరులు పాల్గొన్నారు.

# నైనీ బ్లాకులో చెట్ల గణనకు ముహూర్తం ఫిక్స్



హైదరాబాద్, ఆగష్టు 9: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇటీవలి ఒడిశా పర్యటన తర్వాత నైనీ బొగ్గు బ్లాక్ సంబంధించి మిగిలిన పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటి కే 643 హెక్టార్ల రిజర్వు అటవీ భూమిని సింగరేణికి బదలాయిస్తూ ఒడిశా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా.. తాజాగా 140 హెక్టార్ల గ్రామ అటవీ భూమిని కూడా అప్పగించడంపై సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అలాగే బొగ్గు ఉత్పత్తి ప్రారంభించడానికి వీలుగా చెట్ల గణన, తొలగింపు ప్రక్రియకు కూడా పూర్తి సహకారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహూజా ను ఆయన కోరారు. దీనిపై అహూజా సానుకూలంగా స్పందించారు. తన విజ్ఞప్తి మేరకు 10 రోజుల్లో చెట్ల గణన ప్రక్రియ చేపట్టే విషయంపై ఆయన హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

ఒడిశా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ లో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొత్త బ్లాక్ ల స్థితిగతులపై ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎండీ మాట్లాడారు. ఈ సమావేశంలో కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి అమృతలాల్ మీనా, ఒడిశా రాష్ట్ర ముఖ్య కార్యదర్శి మనోజ్ అహుజా, ఒడిశా రాష్ట్ర బొగ్గు, స్టీల్ మంత్రిత్వ శాఖ, అటవీ శాఖ కార్యదర్శులు, ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(నోడల్, వన్యప్రాణి సంరక్షణ) ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కోల్ ఇండియా ఛైర్మన్ తో పాటు సింగరేణి, మహానది కోల్డ్ ఫీల్డ్స్, ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ సంస్థల సీఎండీలు హాజరయ్యారు. ఈ సమావేశం అనంతరం బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి నేతృత్వంలో అందరూ సీఎండీలు ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీని కలిసి సమావేశ వివరాలను వెల్లడించారు. ఒడిశాలో సింగరేణి సహా ఇతర మైనింగ్ కంపెనీల ప్రాజెక్టులకు పూర్తి సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

అనంతరం నైనీ బొగ్గు బ్లాక్ విస్తరించి ఉన్న చండీపడా నియోజకవర్గ ఎమ్మెల్యే అగస్తి బెహరాను కూడా సంస్థ సీఎండీ కలిసి సహకారం కోరారు.


# శ్మశానవాటిక స్థలం కబ్జా చేశారని దళితుల ధర్నా



మహబూబాబాద్, ఆగష్టు 9:: మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలోని తమ శ్మశానవాటిక స్థలం కబ్జా చేశారని దళితులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాచేశారు. అనంతరం డిప్యూటి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసి బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా దళిత నాయకుడు గుజ్జునూరి బాబురావు మాట్లాడుతూ ఎస్సీ కులస్తులకు సర్వే నంబర్ 512లో 27గుంటల భూమిని కమలాకర్ అనే వ్యక్తి విరాళంగా ఇచ్చాడని, సర్వే నంబర్ 483లోని 32గుంటల భూమి తమ తాతల కాలం నుంచి శ్మశానవాటికకు ఉపయోగించుకుంటున్నామని అన్నారు.

ఈ 59 గుంటల భూమిని మాజీ సర్పంచ్, ఆయన మనుమడు అక్రమంగా ఆక్రమించుకొని పట్టా చేసుకున్నారని ఆరోపించారు.

ఇదేమని వారిని అడుగగా 11 మంది దళితులకు కోర్టు నోటీసులు పంపించారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వారి పట్టాను రద్దు చేసి, అక్రమంగా భూమిని వారికి పట్టాచేసిన అధికారులపై చట్టరీత్యా చర్య తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై డీటీ ఆకుల రవిని వివరణ కోరగా దళితులకు చెందిన 57 గుంటల భూమి కబ్జాకు గురైందని కాలనీవాసులు తమకు వినతిపత్రం అందజేశారని తెలిపారు. 512,483 సర్వే నంబర్ల భూమిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని పేర్కొన్నారు.




# ప్రేమ పేరుతో వేధింపులు.. బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య..

సంగారెడ్డి, ఆగష్టు 9 : యువకుడి వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమడుగు గ్రామానికి చెందిన తేజేశ్వని బీఫార్మసీ చదువుతోంది. తనను ప్రేమించాలంటూ అదే గ్రామానికి చెందిన యువకుడు అతని స్నేహితులతో కలిసి తరచూ విద్యార్థినినీ, ఆమె తల్లిని బెదిరింపులకు గురి చేస్తున్నారు.

దీనిపై పెద్దలు జోక్యం చేసుకుని పంచాయితీ పెట్టినా వేధింపులు ఆగలేదు.. దీంతో ఏమీ తోచని పరిస్థితుల్లో ఆ యువతి తాను ఉంటున్న భవనం నాలుగు అంతస్తుల పై నుండి కిందకు దూకి ఆత్మహత్య చేసుకుంది. వెంటనే కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వారు యువతిని ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయగా.. మార్గమధ్యంలో తేజేశ్వని మృతిచెందింది.. ఆత్మహత్యకు గ్రామంలోని గంజాయ్ బ్యాచ్ కారణమంటూ బంధువులు ఆందోళనకు దిగారు.. నిందితులను ఉరితీయాలంటూ డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

